


ఆస్తులకు కొత్త ధరలు

- నేటి నుంచి అమలు
- తిరుపతిలో 8 శాతం మించలేదు
- డిమాండున్న మండలాల్లో 20 నుంచి 40 శాతం పెంపు

భూముల రిజిస్ట్రేషన్ విలువలు శనివారం నుంచి పెరగనున్నాయి. దీంతో శుక్రవారం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు క్రయ, విక్రయదారులు క్యూ కట్టారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా భూముల ధరలను సవరించి ప్రజల నెత్తిన భారం వేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక భూముల మార్కెట్ విలువను ప్రాంతాల వారీగా సవరణ చేస్తూ, అవసరం మేరకు భూముల విలువ పెంచడం ద్వారా స్వల్పంగా రిజిస్ట్రేషన్ల ధరలను పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని ప్రతిపాదనల కమిటీ పలుదఫాలుగా చర్చించింది. జిల్లాలో భూములకు డిమాండున్న చోట 20 శాతం, చాలా తక్కువ ప్రాంతాల్లో 40 శాతం వరకు పెంచనుంది. తద్వారా జిల్లా వ్యాప్తంగా నెలకు రూ.45కోట్ల అదనపు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



సబ్ రిజిస్ట్రారు కార్యాలయం బయట రిజిస్ట్రేషన్ల కోసం వేచివున్న ప్రజలు

వైసీపీ హయాంలో పెనుభారం

వైసీపీ ప్రభుత్వం నాలుగుసార్లు భూముల విలువ పెంచింది. 2020లో ఒకసారి, 2022లో రెండు సార్లు, 2024లో మరొక సారి పెంచుతూ ఆదేశాలిచ్చింది. పెంచిన ప్రతిసారీ తిరుపతి జిల్లాలో 20 నుంచి 50 శాతం వరకు.. కొన్ని చోట్ల వంద శాతం కూడా పెంచేసి క్రయ, విక్రయదారులపై పెనుభారం మోపింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఇప్పుడు 20 నుంచి 40 శాతానికి మించి పెంచకుండా చర్యలు చేపట్టింది.

తిరుపతిలో 8 శాతంలోపే

తిరుపతి నగరంలో అపార్టమెంట్ల విలువ పెంచలేదు. ఇదివరకే నిబంధనలు మించి ఎక్కువ పెంచడంతో వాటి జోలికెళ్లలేదు.అదేవిధంగా 19, 20వ డివిజన్ల పరిధిలో కూడా ఆస్తుల విలువ ఎక్కువగానే ఉండడంతో వాటిని కూడా సవరించలేదు. ఇక 1 నుంచి 17 డివిజన్ల వరకు చదరపు గజానికి వెయ్యి రూపాయలు, 21 నుంచి 23 డివిజన్లలో ప్రస్తుతమున్న విలువకు 8 శాతం లోపే పెంచనున్నారు.

కిక్కిరిసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

భూముల ధరలు శనివారం నుంచి పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ల కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. కొన్నిచోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో క్రయ, విక్రయదారులు వేచిచూడాల్సి వచ్చింది. తిరుపతి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో సాధారణ రోజుల్లో రోజుకు సుమారు 50 రిజిస్ట్రేషన్లు జరిగితే శుక్రవారం ఆ సంఖ్య వందకు దాటింది. తిరుపతి రూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, నాయుడుపేట మండలాల్లో ఈసంఖ్య రెట్టింపుగా ఉంది. పాకాలలో 10-15కిగాను 30 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

డిమాండు ఉన్న చోటే


జిల్లాలో ఎక్కడైతే కొత్తగా లేఅవుట్లు, నిర్మాణాలు వస్తున్నాయో, అభివృద్ధి, మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకుని ధరలు పెంచారు. కాలుష్యరహిత పరిశ్రమలు (ఎలక్ట్రానిక్ క్లస్టర్స్), జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ రోడ్ల పక్కన భూముల వద్ద 20 శాతం వరకు పెంపుదల చేశారు. ఆస్తుల విలువ పెరిగిన జాబితాలో తిరుపతిరూరల్, రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, చంద్రగిరి మండలాలు ఉన్నాయి.

అదేవిధంగా వ్యవసాయ భూములను మూడు రకాలుగా వర్గీకరిస్తున్నారు. జిల్లాలో పండ్లు (మామిడి, నిమ్మ వంటివి), పూల (మల్లె, బంతి, చామంతి) వీటిని గార్డెన్ కింద తొలి ప్రాధాన్యతగా, ఆతర్వాత మాగాణి భూములు, చివరగా మెట్ట (డ్రై)భూములను విలువ సవరణలో గార్డెన్, మాగాణి, మెట్ట..మధ్య వ్యత్యాసం ఉండేలా ధరలు నిర్ణయించారు.



తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న క్రయ, విక్రయదారులు





తిరుపతిలో నేడు 17 వ పుస్తక మహోత్సవం ప్రారంభం

తరలి వచ్చిన 70 ప్రచురణ, విక్రయ సంస్థలు

పుస్తకాల పండుగొచ్చింది!

- పది రోజుల పాటూ సందడే సందడి
- ప్రతి రోజూ పుస్తకావిష్కరణలు, ప్రముఖుల ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నేటి నుంచీ పుస్తకాల పండుగ మొదలవుతోంది. భారతీయ విద్యాభవన్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో ఏటా జరిగే బుక్ ఎగ్జిబిషన్ ఈఏడాది కూడా ఇస్కాన్ ముందున్న వినాయకనగర్ మైదానంలో నిర్వహిస్తున్నారు. 17 వ తిరుపతి పుస్తక మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి 70 స్టాళ్ళు తరలి రానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు మైదానంలో జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్రీకృష్ణ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించనున్నారు. ప్రారంభ సభలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్ అతిథులుగా హాజరు కానున్నారు.

భారతీయ విద్యా భవన్ సారధ్యంలో ఇరవై ఏళ్ళుగా తిరుపతిలో పుస్తక ప్రదర్శన జరుగుతోంది. తొలినాళ్ళలో కేవలం 20 స్టాళ్ళు మాత్రమే వచ్చేవి. నిరాశ చెందకుండా కొనసాగించడంతో ప్రస్తుతం ఈ సంఖ్య 70కి చేరుకుంది. తిరుపతిలో పెరుగుతున్న విద్యా సంస్థలు, జనాభా, జీవన విధానంలో మార్పులు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని బుక్ ఎగ్జిబిషన్‌లో మార్పుచేర్పులు చేస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. వ్యక్తిత్వ వికాసం, సైన్స్, చరిత్ర, సాహిత్యం, జీవిత చరిత్రలు, ఆత్మకథలు, వంటలు, ఆరోగ్యం వంటి అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి. టీటీడీ పబ్లికేషన్స్, విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్, ఎమెస్కో పబ్లికేషన్స్, విజయవాణి ప్రింటర్స్, సాహిత్య అకాడమీ, అరవిందో సొసైటీ, వేద వర్సిటీ, నవరత్న బుక్ వరల్డ్, వాసవి బుక్ సెంటర్ తదితర సంస్థలు ఈ ప్రదర్శనకు హాజరు కానున్నాయి. ప్రదర్శనా ప్రాంగణంలో ప్రతి రోజూ విద్యార్థులకు వక్తృత్వం, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారు. పుస్తకావిష్కరణలు, పుస్తక పరిచయాలు వంటి కార్యక్రమాలు రోజూ జరుగుతాయి. ప్రసిద్ధ రచయితలు హాజరవుతారు.

ప్రదర్శన వేళలు: ప్రతి రోజూ మధ్యాహ్నం 1 నుంచీ రాత్రి 9 గంటల వరకూ
ప్రవేశం: ఉచితం
సాంస్కృతిక కార్యక్రమాలు: రోజూ సాయంత్రం 6 నుంచి

ఈతరం పుస్తకం చేతబట్టాలి!

- తిరుపతి పుస్తకోత్సవం సారధి నడింపల్లె సత్యనారాయణరాజుతో ఇంటర్వ్యూ - 8లో

తిరుపతిలో నకిలీ మద్యం రాకెట్



- వివిధ రకాల బ్రాండ్లతో తయారీ
- బెల్టు దుకాణాలకు సరఫరా
- రైల్వే కోడూరు ఘటనతో వెలుగులోకి
- ఇద్దరు నిందితుల అరెస్టు
- ప్రధాన సూత్రధారి కోసం గాలిస్తున్న ఎక్సైజ్ అధికారులు



నకిలీ మద్యం సీసాలు, ముడిపదార్థాలకు గోడౌనుగా వాడుతున్న దామినేడులోని ఇల్లు - నకిలీ మద్యం సీసాలు, లేబుళ్లు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కల్తీ మద్యం తయారు చేస్తున్నారు. స్పిరిట్‌తో ఇంకొన్ని ముడిపదార్థాలు కలిపి.. మద్యం సీసాల్లో నింపేస్తున్నారు. చుట్టుపక్కల బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా.. వైసీపీ హయాం నుంచీ నాలుగేళ్లుగా సాగుతున్న నకిలీ మద్యం వ్యాపారం గుట్టు.. శుక్రవారం బయటపడింది.

తిరుపతి నగరం ఎంఆర్‌పల్లె శ్రీకృష్ణ నగర్‌లోని ఇంట్లో నకిలీ మద్యం తయారు చేస్తారు. ముడిపదార్థాలను.. మద్యం సీసాలను ఉంచేందుకు తిరుచానూరు సమీపం దామినేడు ఇందిరమ్మ ఇళ్ల సముదాయంలోని బి. బ్లాక్ నెంబరు 61.. ఇంటిని గోడౌనుగా వాడుకుంటున్నారు. ఇక్కడ్నుంచి కడప, రైల్వే కోడూరు, తిరుపతి రూరల్, చుట్టుపక్కల ప్రాంతాల్లోని బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా.. నాలుగేళ్లుగా నకిలీ మద్యం తయారీ.. సరఫరా జరుగుతున్నా ఎవరూ గుర్తించలేకపోయారు.

వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖను నిర్వీర్యం చేసి సెబ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పర్యవేక్షణ లేకపోవడంతో ఈ నకిలీ మద్యం తయారీ, అమ్మకాలు విచ్చలవిడిగా సాగాయన్న ఆరోపణలున్నాయి. నాలుగు రోజుల కిందట అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో నకిలీ మద్యం భారీగా బయటపడింది. ఆ ప్రాంతానికి చెందిన అయ్యప్ప, వెంకటనారాయణ తిరుపతి నుంచి భారీగా తీసుకెళ్లి.. అక్కడి బెల్టు దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. అక్కడ ఎక్సైజ్ అధికారులు వీరిద్దరినీ అరెస్టు చేసి విచారించడంతో.. దామినేడులోని గోడౌను గురించి చెప్పారు. దీంతో శుక్రవారం ఎక్సైజ్ డీసీ విజయశేఖర్ ఆధ్వర్యంలో దామినేడు ఇందిరమ్మ ఇళ్లలో ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, అసిస్టెంట్ ఈఎస్ వాసుదేవ చౌదరి నేతృత్వంలో ఏసీలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసాచ్చారి, ఇతర అధికారులు, సిబ్బంది శుక్రవారం దాడులు చేశారు. బి బ్లాక్‌లోని 61వ నెంబరు ఇంట్లో 23 స్పిరిట్ క్యాన్‌లు, 145 లేబుల్ షీట్లు, 360 లూస్ బాటిళ్లు, వివిధ బ్రాండ్లతో ఉన్న 89 మద్యం సీసాలు, ఒక బ్యాగు ఖాళీ క్యాప్‌లు, రీసైక్లింగ్ బాటిళ్లు, మరో 6600 ఖాళీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.30 లక్షలు ఉంటుందని అంచనా. ఈ పరిణామంతో స్థానికులు కంగుతిన్నారు. తమ ప్రాంతంలో ఇంత పెద్ద ఎత్తున నకిలీ మద్యం వ్యాపారం జరుగుతోందా అని ఆశ్చర్యపోయారు.

ప్రధాన నిందితుడు వెంకటరమణ

నకిలీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారి.. తిరుపతి శ్రీకృష్ణానగర్‌లోని రావూరి వెంకటరమణ, అయన అతడి తోడల్లుడు జయబాబు ఉన్నట్లు గుర్తించారు. వడమాలపేట మండలం పాదిరేడులో కాపురమున్న వెంకటేష్ పేరుతో సిమ్ కార్డును వెంకటరమణ వాడుకుంటున్నట్లు తెలిసింది. దీని ఆధారంగా కూపీ లాగారు. ఇతడి బంధువులు చికెన్ సెంటర్ నడుపుతున్న చికెన్ శీను, మహేష్‌ను అరెస్టు చేశారు. గోడౌనుగా వాడుతున్న దామినేడులోని ఇల్లు శీను సోదరిది కావడం గమనార్హం. ఈ నకిలీ మద్యం వెనుక ఎవరున్నారు? ఎక్కడ్నుంచి ముడి పదార్థాలు తీసుకొస్తున్నారు? అనే అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కృష్ణానగర్‌లోని వెంకటరమణ ఇంట్లో సోదాలు చేసి దాదాపు రూ.6 లక్షల నగదు, 283.95 గ్రాముల బంగారు నగలు, చాసెట్ మిషన్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, వెంకటరమణ గతంలో కువైత్‌లో ఉండి వచ్చినట్లు సమాచారం. అన్నారావు సర్కిల్ వద్ద జరిగిన ఒక ఘటనలో రౌడీషీటర్ కింద ఇతడిపై కేసు నమోదైనట్లు ఎక్సైజ్ అధికారులు చెప్పారు. ఆ దిశగానూ విచారణ సాగుతోంది. అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు డీసీ విజయశేఖర్ మీడియాకు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐలు శ్యామ్ నాయుడు, నరసనాయుడు, రామచంద్ర, తులసి, ఎస్ఐలు స్వామినాథన్, హరికృష్ణ, జయశంకర్, మహేష్, కవీశ్వర నాయుడు, హెడ్ కానిస్టేబుళ్లు ధర్మయ్య, రమేష్, మనోహర రెడ్డి, కానిస్టేబుళ్లు వేణు, కార్తికేయన్, మునిరెడ్డి కృషి అభినందనీయమని డీసీ కొనియాడారు.



స్వాధీనం చేసుకున్న స్పిరిట్, లేబుళ్లు తదితరాలతో ఎక్సైజ్ అధికారులు

పాతాళగంగ కాస్త కనికరించింది



- జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం - 8లో
- తిరుపతికి మాత్రం ప్రమాద ఘంటికలు

నేడు పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నారు. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది జిల్లాలోని 34 మండలాల్లో ఇంటింటికీ వెళ్లి అంద జేయనున్నారు. 2,63,191 మంది లబ్ధిదారులకు 5,827 సచివాలయ సిబ్బంది ద్వారా అందజేసేలా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.112.19 కోట్లు కేటాయించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు.



బోర్డు సభ్యులు, అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించి చర్చిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

రథసప్తమికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈనెల 4న తిరుమలలో జరిగే రథసప్తమికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. భక్తులు కూడా ఎలాంటి తొందరపాటు లేకుండా ఓపికతో శ్రీవారి దర్శనం, వాహనసేవలు వీక్షించాలని కోరారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో శుక్రవారం రథసప్తమి ఏర్పాట్లపై టీటీడీ ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశం జరిగింది. అనంతరం టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. విజిలెన్స్, పోలీసులు, అధికారులు సమన్వయంతో రథసప్తమికి మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేయాలని బోర్డులో తీర్మానించామన్నారు. రథసప్తమి వేడుకలకు 2 నుంచి 3 లక్షల మంది వచ్చే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నామన్నారు. దీనికి తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని బోర్డులో వివిధ అంశాలపై చర్చించామని, సురక్షితమైన దర్శనం కల్పించేలా అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. 1250 మంది పోలీసులు, వెయ్యి మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రత కల్పిస్తామన్నారు. ఆక్టోపస్, ఏపీఎస్పీ, అగ్నిమాపక సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారన్నారు. మాడవీధుల్లోని గ్యాలరీల్లో అత్యవసర మార్గాలూ ఏర్పాటు చేశామన్నామన్నారు. చక్రస్నానం సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామన్నారు. గ్యాలరీల్లోని భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ అందజేస్తామన్నారు.చలికి, ఎండకు ఇబ్బంది లేకుండా గ్యాలరీల్లో టెంట్లు వేశామన్నారు. భక్తుల కోసం దాదాపు 8 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఎస్వీబీసీలో వాహన సేవల ప్రత్యేక్షప్రసారాలు ఉంటాయన్నారు. పారిశుధ్యంనా ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు.

మాడవీధుల్లో తనిఖీలు

నాలుగు మాడవీధుల్లో జరుగుతున్న రథసప్తమి ఏర్పాట్లను సభ్యులు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి చైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. గ్యాలరీల్లోని భక్తులకు ఎప్పటికప్పుడు పబ్లిక్ అడ్రెస్ సిస్టిమ్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. వాహనమండపం నుంచి నాలుగు మాడవీధుల్లో తిరిగి ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈతనిఖీల్లో బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, ఎమ్మెస్ రాజు, భానుప్రకాష్‌రెడ్డి, పనబాక లక్ష్మి, ఆనంద్‌సాయి, శాంతారామ్, సన్నపనేని సదాశివరావు, నరేష్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి కాదు.. రెండు

- ఎస్వీయూలో చిరుత సంచారంపై ఫారెస్టు అధికారుల అంచనా
- లైబ్రరీ వెనుక చెట్టుపై జింకను చంపి తినడంతో భయాందోళన

చెట్టుపైన జింక కళేబరం





చెట్టు కింద చనిపోయి ఉన్న జింక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు చిరుతలు ఎస్వీ యూనివర్సిటీ పరిసరాల్లో సంచరిస్తున్నట్టు అటవీ శాఖ అధికారులు అంచనాకు వచ్చారు. కొంత కాలంగా వర్సిటీలో చిరుత సంచారంపై ఆధారాలున్నాయి. అటవీశాఖ అధికారులూ క్షేత్రస్థాయికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లోనూ చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారణ అయింది. శ్రీనివాస ఆడిటోరియం, బోటనీ గార్డెన్, హెచ్-బ్లాక్ హాస్టల్ పరిసరాల్లో చిరుత సంచిరించినట్టు అక్కడి విద్యార్థులు చూడటంతో పాటు వారి సెల్‌ఫోన్లలోనూ దృశ్యాలను రికార్డు చేశారు. తాజాగా మూడు రోజుల కిందట సెంట్రల్ లైబ్రరీ వెనుక వేప చెట్టుపైనే జింకను చంపి తిన్న విషయం యూనివర్సిటీలో దావానలంగా వ్యాపించింది. కొందరు విద్యార్థులు, ఉద్యోగులు శుక్రవారం ఈ ప్రాంతాన్ని చూశారు. చిరుత సంచారంపై విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వర్సిటీ పరిసరాల్లో తిరిగేది రెండు చిరుతలనే అంచనాకు రావడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. అత్యవసరమైతేనే తప్ప సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకూ యూనివర్సిటీలో తిరగొద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.



వానర ఘోష!







పిడికెడు పొట్ట నింపుకోవడానికి ఆ వానరాలు ఆశపడి మృత్యువు పాలవుతున్నాయి. తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్‌లో రోడ్డుకి ఇరువైపులా వానరాల మృతదేహాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి అడవులను ఆశ్రయించి ఉండే వానరాలకు తగినంత ఆహారం లభించక, రోడ్డుకి ఇరువైపులా గుంపులుగా చేరి వాహనాల వైపు చూస్తుంటాయి. జీవకారుణ్యంతో వాహనదారులు కూడా కొందరు వీటికి అరటి, బొప్పాయి పండ్లు, ఇతర ఆహారపదార్థాలు వేస్తుంటారు. ఇదే వీటి పాలిట ప్రమాదంగా మారుతోంది. ఆటోలు, ట్రక్కులు కనిపించగానే, తమ కోసం ఆహారం ఉందేమో అని రోడ్డుమీదకు దూకేస్తున్నాయి. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని చనిపోతున్నాయి. పట్టణాల్లో బెడదగా మారిన కోతులను పట్టి ఈ ప్రాంతంలో వదిలేస్తూ ఉండడంతో కూడా ఇక్కడ వీటి సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది.

\- భాకరాపేట, ఆంధ్రజ్యోతి

టీటీడీ ప్రహరీ ధ్వంసం



తిరుపతిరూరల్, జనవరి31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలోని పాతకాల్వ గ్రామంలో సర్వేనంబరు-1లో టీటీడీ నిర్మించిన ప్రహరీని కొంతభాగం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసంచేశారు. సుమారు పది అడుగుల మేర గోడను కూల్చివేశారు. కాగా రెవెన్యూ రికార్డులో సర్వే నంబరు-1లో 24.04 ఎకరాలు చెరువుగా నమోదై ఉంది.

జోరుగా రహదారుల నిర్మాణ పనులు

● పాతకాల్వలో మట్టిదారి ఏర్పాటు ● గాంధీపురంలో సీసీ రోడ్డు నిర్మాణం





తిరుపతిరూరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామంలో మట్టిరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో నుంచి మున్నీశ్వర స్వామిగుడి వరకు రూ.2.50లక్షల గ్రామపంచాయతీ నిధులతో మట్టిదారి నిర్మిస్తున్నారు. టీడీపీ గ్రామకమిటీ ప్రతినిధులు శివారెడ్డి, రోశిరెడ్డి, ప్రభురెడ్డి, రమేష్‌రాయల్ నేతృత్వంలో పనులు నిర్వహిస్తున్నారు. ● అలాగే సి.మల్లవరం పంచాయతీ పరిధిలోని గాంధీపురంలో ఉపాధి హామీ నిధులు రూ.6లక్షల అంచనాతో సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లహరి, వెంకటకేశవ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

తొక్కిసలాటలో గాయపడిన మహిళకు పరిహారం



తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జనవరి8న వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ సమయంలో జరిగిన తొక్కిసలాటలో గాయపడిన భక్తురాలికి టీటీడీ శుక్రవారం పరిహారాన్ని అందజేసింది. కడప జిల్లా వీరపనాయనపల్లి మండలం, సర్వరాజుపేట కాలనీకి చెందిన బాధితురాలు శైలజకు రూ.2 లక్షల పరిహార డీడీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో బోర్డు సభ్యులతో కలిసి అందజేశారు.

గాలిగోపురం వద్ద టీటీడీ ఈవో ఆకస్మిక తనిఖీలు



తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలోని గాలిగోపురం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గాలిగోపురం వద్దనున్న వైద్యులు, మందుల లభ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఏడోమైలు వద్ద కూడా తనిఖీలు చేశారు. దుకాణాల ముందున్న పరిశుభ్రతను పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్కడున్న దుకాణాల లైసెన్సులను స్వయంగా తనిఖీ చేశారు.

అబ్బురపరిచిన భరతనాట్యం



తిరుమలలోని నాదనీరాజనం వేదికపై శుక్రవారం సాయంత్రం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అబ్బురపరిచింది. బెంగళూరుకు చెందిన నయన తన బృందంతో కలిసి ఈప్రదర్శన ఇచ్చారు. అన్నమయ్య, పురందరదాసు, త్యాగరాజు సంకీర్తనలకు అద్భుత నృత్య భంగిమలతో ప్రేక్షకులను అలరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు మహా శివరాత్రి ఉత్సవాలపై మంత్రుల సమీక్ష

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల జరనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై శనివారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పు రపాలకసంఘ కార్యాలయంలో మధ్యాహ్నం 1గంటలకు ఈ సమీక్ష జరగనుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా పాల్గొంటారని పేర్కొన్నారు.

సంఘమిత్రకు రాష్ట్రస్థాయి అవార్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన క్రాంతి మ్యాక్స్ గ్రామ సంఘం సహాయకురాలు మోహన కుమారికి డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు అధికారి శోభన్ బాబు చేతులు మీదగా సూళ్ళూరుపేట మం డలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జ్ఞాపికను అందజేశారు. స్త్రీనిధి రుణం పొందడం, చెల్లించడంలో బీఎన్‌కండ్రిగకు చెందిన క్రాంతి మాక్స్ గ్రామ సమాఖ్య ఆద ర్శంగా నిలవడంతో రాష్ట్రస్థాయి ఎంపికైంది.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



నాగలాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆదిమూలం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా రథోత్సవానికి మాడవీధుల విస్తరణ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తా మన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నాయకులు పార్తిబన్, సెల్వకుమార్, మురళి, ఇళంగోవరెడ్డి, ఎస్‌ఎం సురేష్, ఈవో లత పాల్గొన్నారు.

గిరాకీలు రావడం లేదు... ఉపాధి కల్పించండి

రైల్వే జీఎంకు లైసెన్స్ కూలీల వినతి

రేణిగుంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లైసెన్సు కూలీలుగా విధులు నిర్వహిస్తున్న తమకు గిరాకీలు రావట్లేదని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ దృష్టికి రేణిగుంట రైల్వే స్టేషన్‌లో కూలీలు శుక్రవారం తీసుకొచ్చారు. తిరుపతి పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలులో గుంతకల్లు వరకు ఇన్‌స్పెక్షన్‌కు వెళుతుండగా ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాటు చేయడంతో పాటూ చక్రాల సూట్ కేసులు రావడంతో గిరాకీలు తగ్గిపోయాయని ఈ సందర్భంగా జీఎం దృష్టికి తీసుకెళ్లారు. తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ శేషగిరినాథ రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్, గుంతకల్లు, సికింద్రాబాద్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

చంద్రగిరి

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

చంద్రగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కాపు, కమ్మ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, ఈబీసీ, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా రుణాలకు అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు ఇద్దరికి గాయాలు



చంద్రగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి తిరుపతికి వస్తున్న కారు శుక్రవారం పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో తొండ వాడ వద్ద అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న మను, వసుధలకు గాయాలయ్యాయి. వారిని 108లో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం



తిరుచానూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి అత్యంత వేడుకగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరికి నాని పూజలు



ఎమ్మెల్యే పులివర్తి నానికి స్వాగతం పలుకుతున్న ఆర్యవైశ్య మహిళలు

భాకరాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పూజలు నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు ఆర్యవైశ్య సంఘం వారి ఆహ్వానం మేరకు కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవ పూజల్లో పాల్గొన్నారు. ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం తరపున ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళీ, శివకుమార్, చిట్టెమ్మ, సుజాత, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. రిజిస్ట్రేషన్లు ఆలస్యం



సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్లకోసం వేచివున్న ప్రజలు

పాకాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూముల మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్ చార్జీలు శనివారం నుంచి పెరగనున్న దృష్ట్యా శుక్రవారం రిజిస్ట్రేషన్‌ల కోసం పాకాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కొనుగోలుదారులు అధిక సంఖ్యలో వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ సమస్యతో రిజిస్ట్రేషన్‌లు మందకొడిగా సాగాయి. క్రయ విక్రయదారులతో కార్యాలయ ఆవరణంలో సందడి నెలకొంది. రిజిస్ట్రేషన్లు ఆలస్యం కావడంతో పలువురు కార్యాలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 6 గంటల పైన సర్వర్ వేగం కావడంతో 7-30 గంటలకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సాధారణ రోజుల్లో 10 నుంచి 15 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా శుక్రవారం 30కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి.

ఎన్ఐటీటీటీఆర్‌తో ఎంబీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న ఎన్ఐటీటీటీఆర్, ఎంబీయూ ప్రతినిధులు

చంద్రగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): చెన్నైలోని ఎన్ఐటీటీటీఆర్ సంస్థ, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం పరిశోధన పురోగతి పెంపొందించే లక్ష్యం కోసం సహకార భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాయి. గురువారం చెన్నైలోని ఎన్ఐటీటీటీఆర్ సంస్థలో జరిగిన సమావేశంలో ఈ ఒప్పందం కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ఎన్ఐటీటీటీఆర్ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉషానటేశన్ నాయకత్వం వహించారు. ఈభాగస్వామ్యం అధ్యాపకులు, విద్యార్థులు ఇద్దరికీ అకడమిక్ అనుభవాన్ని మెరుగుపరచడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ రంగాలలో పరిశోధనా రంగానికి దోహదం చేస్తుందని అధ్యాపకులు తెలిపారు. ఈభాగస్వామ్యం ఎన్ఐటీటీటీఆర్, ఎంబీయూ మధ్య విద్యా నెట్ వర్క్‌ను బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. ఎంబీయూ నుంచి ప్రొవోస్ట్ ప్రొఫెసర్ నాగరాజరామారావ్, ఎంబీయూ వైస్ చాన్స్‌లర్ కరుణాకరన్, రీసెర్చ్ అడ్ ఇన్నోవేషన్ ప్రొఫెసర్ అవిరేణి శ్రీనివాసులు, అకడమిక్ అఫైర్స్ డీన్ పీవీరమణ, ఏఐఎంఎల్ విభాగాధితి నరేంద్రకుమార్‌రావు, పరిశోధన డిప్యూటీ డీన్ పరిమళసుందర్ పాల్గొన్నారు.

రేపు ధ్వజస్తంభ ప్రతిష్ఠ



విశేష అలంకరణలో కట్ట మీద గంగమ్మ

భాకరాపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లె వద్ద వెలసి ఉన్న కట్ట మీద గంగమ్మ ఆలయం శిఖర కలశ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేస్తున్నట్లు ధ్వజస్తంభ దాత సహదేవరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 1న శనివారం సాయంత్రం గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, సకల దేవత పరివార పూజలు, హోమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం తెల్లవారుజామున పీఠన్యాసం, లోహన్యాసం, శిఖల కలశ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ అనంతరం నాడీ సంధానం, స్పర్శ ఆహుతి, మహా పూర్ణాహుతి, ఉదయం కుంభజల సంప్రోక్షణ, అమ్మవారికి విశేషాలంకరణ అనంతరం భక్తులకు దర్శనం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. భక్తులు పూజల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ప్రిన్సిపాల్ మురగయ్య సేవలు అమూల్యం



ప్రిన్సిపాల్ మురగయ్యకు వీడ్కోలు పలుకుతున్న అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది

ఎర్రావారిపాళెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నెరబైలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురగయ్య సేవలు అమూల్యమని ఎస్వీయూ రిజిస్ట్రార్ డాక్టర్ భూపతినాయుడు అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మురగయ్య ఉద్యోగ విరమణ సమావేశం శుక్రవారం కళశాల ఆవరణంలో జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ మురగయ్య విద్యారంగానికి చేసిన సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయులు మాట్లాడుతూ అంకితభావంతో విద్యార్థుల ఉన్నతికి మురగయ్య ఎంతగానో కృషిచేశారని శ్లాఘించారు. డిజిటల్ యుగంలో విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. వసతులను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. శుక్రవారం తొండవాడ సమీపంలోని ఎన్టీఆర్ నగర్‌లో ఎమ్మెల్యే కార్యాలయాన్ని పులివర్తి నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజలు ఏదైనా సమస్యపై అర్జీ ఇస్తే ఇక్కడ నుంచి సంబంధిత శాఖకు పంపించి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకొంటామ న్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాపాడుదాం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ఎర్రావారిపాళెం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల రక్షణతో సమాజాభివృద్ధి సాధ్యమని తహసీల్దార్ పరమేశ్వరస్వామి అన్నారు. మండలంలోని చింతగుంట పంచాయతీ ఆది ఆంధ్రవాడలో శుక్రవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. దళితులు, గిరిజనులకు కావలసిన సౌకర్యాలను అధికారులు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను దళితులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చట్ట పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పౌరుల హక్కుల ప్రతిజ్ఞ చేశారు. ఈ సమాశేశంలో అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

గోకులాలు పాడి రైతులకు వరం



షెడ్‌లో పూజలు చేస్తున్న నాయకులు

భాకరాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులాలు పాడి రైతులకు వరం లాంటివని జనసేన నాయకులు రూపేశ్‌కుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు పంచాయతీలో గోకులం షెడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో భార్గవి, జనసేన నాయకులు జయశంకర్, హరినాథ్, చెంగల్ రాజు, మురళి, రామకృష్ణ, భాను, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతిగా రాజశ్యామలదేవి



ప్రత్యేక అలంకారంలో రాజశ్యామలదేవి

రామచంద్రాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీశక్తి పీఠంలో రాజశ్యామలదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సరస్వతిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలతో కాళీ హోమం నిర్వహించారు. అనంతరం తిరుమంజనం నిర్వహించి అమ్మవారిని కలువ పూలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ జరిపించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి, శక్తీ పీఠాదీశ్వరి రమ్యానంద భారతిస్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.

హెచ్‌ఎం వాగ్దేవికి ఘనసన్మానం



రామచంద్రాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కమ్మకండ్రిగ నాగమ నాయుడు ఎర్రమ్మ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన వాగ్దేవిని పలువురు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు ఆనందమనాయుడు మాట్లాడుతూ 9 సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి విద్యార్థుల అభ్యున్నతికి వాగ్దేవి ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం పలువురు వాగ్దేవిని శాలువా కప్పి సన్మానించారు. కార్వేటినగరం డైట్ ప్రిన్సిపాల్ శేఖర్, ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కావ్య, దేవరాజులునాయుడు పాల్గొన్నారు.

కార్మికశాఖ మంత్రిని కలిసిన టీడీపీ నాయకుడు

రామచంద్రాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కమ్మకండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు భక్తవత్సలనాయుడు శుక్రవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికులకు లేబర్‌కార్డులు, జీవితబీమా కల్పించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కాలువ స్థలంలో అక్రమ నిర్మాణాలకు బ్రేక్



కాలువ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతిరూరల్, జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం పేరూరులో సర్వేనంబరు 460, 460/2లోని మొగిలికళం కాలువ పొరంబోకు భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కాలువస్థలంలో గుట్టుచప్పుడు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని రూరల్ తహసీల్దార్ రామాంజులునాయక్‌కి ఫిర్యాదు అందింది. స్పందించిన ఆయన వెంటనే స్థలపరిశీలన చేసి నిర్మాణాలను నిలుపుదల చేయాలని వీఆర్వోలని ఆదేశించారు. దీంతో వీఆర్వోలు రమేష్, మురళి, యోగానంద్ తదితరులు స్థలాన్ని సందర్శించారు. నిర్మాణపనులను అడ్డుకున్నారు.

నిర్లక్ష్య ఫలితమే ఈ ఆక్రమణలు

గత వైసీపీపాలనలో ఇదేసర్వేనంబర్లలోని కాలువ పొరంబోకుస్థలాన్ని ఆక్రమించి 10కిపైగా నిర్మాణాలను చేపట్టారు. వీటికి పంచాయతీ అధికారులు ఎన్వోసీలు ఇవ్వడంతో విద్యుత్ మీటర్లు అమర్చుకున్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అక్రమణ నిర్మాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు గ్రామస్తులు విన్నవించారు. అయితే ఆక్రమణలపై ఇప్పటికీ రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పుడు మరికొందరు ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



కన్యకాపరమేశ్వరికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక కొత్తవీధిలో కొలువైన వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే దంపతులు సారె సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. చిరువ్యాపారాలకు వడ్డీలేని రుణం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, శిరీష, మంజునాథ్, హేమచంద్రకుమార్, వెంకటేషగుప్తా తదితరులు పాల్గొన్నారు.

టైరు మెకానిక్‌కు ఉత్తమ అవార్డు



డీపీటీవో చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న తులసీరామ్

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ టైరు మెకానిక్ జి.తులసీరామ్‌కు ఉత్తమ అవార్డు లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడ కార్యాలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అందజేయగా శుక్రవారం మధ్యాహ్నం డీపీటీవో జి.నరసింహులు చేతులమీదుగా స్వీకరించారు. తిరుమల డిపోలో పనిచేస్తున్న తులసీరామ్ తన నైపుణ్యంతో బస్సు టైర్ల కాలపరిమితిని విశేషంగా పెంచినందుకు ఈ అవార్డు ప్రదానం చేశారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, టి.ఎం.చంద్రయ్య, బ్రహ్మయ్య, ఎల్.జి.నాయుడు పాల్గొన్నారు.

కల్యాణ మండపం సాధించిన ఘనత మజ్దూర్ యూనియన్‌దే

తిరుపతి(సెంట్రల్) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రైల్వే కల్యాణ మండపం సాధించడంలో రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు కీలకపాత్ర పోషించారని ఆ యూనియన్ గుంతకల్లు డివిజన్ మాజీ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు తెలిపారు. గజానన్ మాల్యా జీఎంగా ఉన్న సమయం నుంచి తమ పోరాటం కొనసాగించామని పేర్కొన్నారు. తమ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి ఈ విషయమై జీఎం ఏకే జైన్‌తో చర్చించి, నిధుల మంజూరుకు కృషి చేశామని వివరించారు.

స్కావెంజర్స్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



స్కావెంజర్స్ కాలనీలో పర్యటించిన కమిషనర్ మౌర్య

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గృహాల వద్ద, వాణిజ్య సముదాయాల్లో ప్రతి రోజూ తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ మౌర్య పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. 33వ డివిజన్‌లోని స్కావెంజర్స్ కాలనీ, రైల్వే కాలనీ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ దూది కుమారి, హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి శుక్రవారం ఉదయం కమిషనర్ తనిఖీలుచేశారు.ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నా రు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయకుండా సిబ్బందికి అందించాలన్నారు. దుకాణాల వద్ద చెత్త బుట్టలను పరిశీలించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. స్కావెంజర్స్ కాలనీ వాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసీకుమార్, డీఈ రాజు, ఏసీపీ బాలాజీ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

గంజాయి బ్యాచ్‌లపై నిఘా

ఆంధ్రజ్యోతి కథనంపై స్పందించిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి బ్యాచ్‌లపై పోలీసులు నిఘా ఉంచారు. ఈ నెల 30న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన తిరుపతిలో గంజాయిబ్యాచ్ వీరంగంవార్తపై పోలీసులు స్పందించారు. ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్, ఈస్ట్, వెస్ట్, అలిపిరి పోలీసులు బృందాలుగావిడిపోయి గంజాయిబ్యాచ్‌లపై ఆరాతీశారు.అశోక్‌నగర్‌లో సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టారు. వీధుల్లో గంజాయి తాగుతూ దౌర్జన్యాలు చేస్తున్న వారి వివరాలు సేకరించారు. రైల్వే కాలనీలోనూ శుక్రవారం పోలీసులు తనిఖీలు చేసి, స్థానికులను విచారించారు. ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడితే డయల్ 112కు ఫోన్ చేసి చెప్పాలని సీఐ రాంకిషోర్ కోరారు.

రేణిగుంట పార్కు సుందరీకరణకు ప్రణాళికలు

తిరుపతి, జనవరి31(ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేఅవుట్లలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తుడా వీసీ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. తుడా ఆధ్వర్యంలో సూరప్పకశం, నగరి వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్లను, నగరి, రేణిగుంటలోని పార్కులను శుక్రవారం ఆమె పరిశీలించారు.తుడా లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం పక్కగా ఉండేలా చూడాలన్నారు. రేణిగుంటలోని పార్కు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, సీపీవో దేవికుమారి, డీఈ బాషా, ఉద్యానవన శాఖ అధికారి మాలతి, సర్వేయర్ దేవానంద్ తదితరులు ఉన్నారు.

అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ

తిరుపతి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్లలో నాణ్యమైన ఆహార పదార్థాలు ప్రజలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద గల అన్న క్యాంటీన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మద్యం దుకాణంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి), తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న నైన్ స్టార్ మద్యం దుకాణంలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. దుకాణంలో ఉన్న రూ.1.45 లక్షలు అపహరించారు. రూరల్ ఎస్ఐ షేక్‌షావలి వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మునిరాజా ఆర్‌సీ పురం రోడ్డులో మద్యం దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి 10 గంటలకు తాళం వేసి వెళ్లాడు. దుండగులు దుకాణం వద్ద ఉన్న సీసీ కెమెరాలు కిందకు తిప్పి, రేకులు తొలగించి లోపలకు వెళ్లారు. దుకాణంలో ఉంచిన రూ.1.45 లక్షల నగదు అపహరించుకెళ్లారు. మునిరాజా ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ షావలి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం స్థానిక శంకరయ్య కాలనీలో చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. శంకరయ్య కాలనీకి చెందిన గిరి(24) ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తీరిక సమయంలో పెయింట్ పనులు చేస్తున్నాడు. నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా మానసిక వేదనతో ఉన్న గిరి శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.



రాజీవ్‌గాంధీ కాలనీలో బోరును పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు (ఫైల్‌ఫొటో) - బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది - ఎస్‌ఎల్‌వీనగర్‌లో గుంతలకు ప్యాచ్‌లు వేసిన దృశ్యం

రాజీవ్‌గాంధీకాలనీలో సమస్యలకు పరిష్కారం

బోర్లకు, రోడ్డుపై గుంతలకు మరమ్మతులు - ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన



తిరుపతి(జీవకోన), జనవరి31(ఆంధ్రజ్యోతి): అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో భాగంగా ఆంధ్రజ్యోతి ప్రచురించిన వార్తలకు, ప్రజల నుంచి వచ్చిన వినతులకు అధికార యంత్రాంగం స్పందించింది. జీవకోన పరిధిలోని రాజీవ్‌గాంధీకాలనీలో నిరుపయోగంగా ఉన్న బోరును బుధవారం కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మలతో కలిసి పరిశీలించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం బోరుకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రాజీవ్‌గాంధీకాలనీ ప్రధాన రోడ్డులో ప్రమాదకరంగా తెరచి ఉంచిన గేట్‌వాల్ గుంత పైకప్పును కూడా మూసివేశారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రాజీవ్‌గాంధీకాలనీ సమీపంలోని ఎస్‌ఎల్‌వీనగర్‌లో రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయంటూ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ప్రధాన రోడ్డులోని గుంతలను పూడ్చివేశారు.దీంతో వాహనదారులకు, పాదచారులకు ఉపశమనం లభించినట్లయింది.



గుంతలమయంగా ఉన్న రోడ్డు (ఫైల్‌ఫొటో) - గేట్‌వాల్ గుంత పైకప్పును మూసిన దృశ్యం

'భూమన అరాచకాలకు అధికారులు బలి'



తిరుపతి (వైద్యం), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అవినీతి, అరాచకాలకు ఎంతో మంది అధికారులు బలైపోయారని టీడీపీ సీనియర్ నేత, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో తిరుపతిలో జరిగినన్ని దౌర్జన్యాలు దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. కుమారుడిని అందలం ఎక్కించడానికి కరుణాకరరెడ్డి కార్పొరేషన్ ఎన్నికల్లో 32 వేల దొంగ ఓట్లు వేయించారని విమర్శించారు. మేయర్‌కు ప్రాధాన్యత లేకుండా చేసి, కార్పొరేషన్ నిధులను అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. తిరుపతి ప్రజలకు ఆయన గురించి తెలుసునని, అందుకే గత ఎన్నికల్లో కుమారుడిని 62 వేల ఓట్ల తేడాతో ఓడించి సరైన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని, అనవసర విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సుబ్బుయాదవ్, సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, జగన్నాథం, నాగప్రతాప్, ముని తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను తక్షణమే వైద్యశాలకు తరలించండి

డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖాధికారులు

తిరుపతి (రవాణా), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను తక్షణమే వైద్యశాలకు తరలించాలని, ఈ ప్రక్రియలో సహాయపడే వారికి బహుమతి రూపంలో రూ.5వేలు నగదుతోపాటు ప్రశంసాపత్రం ఇస్తామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణనాయక్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా తిరుపతి నగర పరిధిలోని స్విమ్స్ సర్కిల్ వద్ద గుడ్ సమారిటన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో క్షతగాత్రులను తరలించే అంశంలో సహాయపడిన వ్యక్తికి పోలీసు, న్యాయస్థానం నుంచి రక్షణ ఉంటుందని తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికానాజ్ మాట్లాడుతూ మోటారు వాహన చట్టం ప్రకారం సదరు వ్యక్తికి చట్టబద్ధమైన రక్షణ కల్పిస్తామన్నారు. అనంతరం రహదారి భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పూజావాణి ఉపాధ్యాయ, డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలి



తిరుపతిరూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవో నెంబరు 2ను సవరించి అందరికీ ఎంటీఎస్ అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆప్కాస్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం వెటర్నరీ యూనివర్సిటీలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.చిన్నబాబు, వెటర్నరీ యూనివర్సిటీ కార్యదర్శి బి.మునిరాజు, నాయకులు గంగయ్య, బాబు, నందకిషోర్, మురళీనాయుడు, రాజారెడ్డి, గురుకుమార్, రాజేష్, నాగేంద్ర, చిన్నబ్బ, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు ఘంటసాల పాటల పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల రాష్ట్ర స్థాయి పాటల పోటీలు ఆదివారం నిర్వహించనున్నారు. యశోదనగర్‌లోని వేమ విజ్ఞాన కేంద్రంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. తిరుపతి జోన్‌లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ రూ.15 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ రూ.5 వేల నగదు బహుమతులు అందించనునారు. ఈ నెల 11 వ తేదీ విజయవాడలో నిర్వహించే ఫైనల్స్‌లో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు నగదు బహుమతులు అందించనున్నారు. వివరాలకు 7207532799లో సంప్రదించాలని నిర్వాహకులు రహమతుల్లా, రామారావు కోరారు.

నైపుణ్యాలను పెంచుకుంటేనే అభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా జీవితం లో అభివృద్ధి చెందవచ్చని పలువురు సూచించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఉమెన్ స్టడీస్ విభాగంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీయూ అడల్ట్ ఎడ్యుకేషన్ రిటైర్డు ప్రొఫెసర్ ఆదినారాయణ రెడ్డి, పద్మావతి వర్సిటీ డీన్ విజయలక్ష్మి, సైకాలజిస్టు సుధాకర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. విద్య ద్వారా ట్రాన్స్‌జెండర్లు సమాజంలో రాణించడానికి అవకాశం ఉందన్నారు. తమకు ఉన్న హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాన్స్‌జెండర్లను సమాజం గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఉమాదేవి, అధ్యాపకులు నీరజ, తవితా తులసి, విద్యార్థులు, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటసత్యహారిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ బయోటెక్నాలజీ స్కాలర్ జి. వెంకట సత్య హారిక డాక్టరేట్ పొందారు. ఎవల్యూషన్ ఆఫ్ అడ్రెనోమెడిల్లిన్ యాంటగోనెస్ట్ ఇన్ ద సప్రెషన్ ఆఫ్ ఓవరియన్ క్యాన్సర్ యాన్ ఎక్స్‌పెర్‌మెంటల్ అప్రోచ్ అంశంపై ప్రొఫెసర్ పి.జ్యోత్స్న పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్లు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

పట్టించుకోండి సారూ!

ఇంకెన్నాళ్లిలా?



రేణిగుంట ప్రధాన రహదారిలోని నారాయణాద్రి ఆస్పత్రికి ఎదురుగా అండర్ డ్రైనేజీ పైపులు మరమ్మతులకు గురయ్యాయి. మురుగు నీటి ఉధృతికి రోడ్డుపై పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అక్కడ రోడ్డును బ్లాక్ చేశారు. ట్రాఫిక్‌ను పక్కన దారికి మళ్లించారు. మరమ్మతు పనులు పూర్తిచేసి నెల రోజులు కావస్తున్నా వాహనాలను అనుమతించడం లేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అధికారులు తక్షణమే స్పందించి ఆ దారిలో వాహనాలను వదిలిపెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

తిరుపతి (జీవకోన), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక లీలామహల్ కూడలిలో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. చేపల మార్కెట్ నుంచి లీలామహల్ కూడలికి వచ్చే సర్కిల్‌లో మ్యాన్‌హోల్ మూత గుంతలో పడిపోయింది. ఏమాత్రం ఏమరపాటుగా వచ్చినా ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.



కుంభమేళా నమూనా ఆలయంలో

రోజుకు 10వేలమందికి దర్శనం



● టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద మహా కుంభమేళాలో టీటీడీ నమూనా ఆలయంలో రోజుకు 8 నుంచి 10 వేలమంది శ్రీవారిని దర్శించుకుంటున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అన్నమయ్య భవనంలో శుక్రవారం బోర్డు సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల తరహాలోనే శ్రీవారి కైంకర్యాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. తిరుమల నుంచి వెళ్లిన పోటు సిబ్బందితో ప్రసాదాలను తయారు చేసి వితరణ చేస్తున్నామని తెలిపారు. మహాకుంభమేళాలో దాదాపు 250 మందికిపైగా టీటీడీ ఉద్యోగులు సేవలందిస్తున్నారంటూ వారికి ధన్యవాదాలు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో 'లైలా' హీరో




విశ్వక్‌సేన్ - సత్యాత్మతీర్థ స్వామిజీ

కాలినడకన తిరుమలకు చేరుకున్న హీరో విశ్వక్‌సేన్ శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. ఫిబ్రవరి 6 'లైలా' సినిమా ట్రైలర్ విడుదల కాబోతున్న సందర్భంగా తిరుమల దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. 'లైలా'లో తాను అమ్మాయి వేషం వేశానని, తన జీవితంలో ఈ సినిమా ప్రత్యేకం అని అన్నారు. ప్రతి సినిమా విడుదలకు ముందు తాను తిరుమలకు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నానని తెలిపారు. 'లైలా' విడుదల తర్వాత కూడా మరోసారి తిరుమలకు వస్తానన్నారు. త్వరలో 'ఫంకీ' చిత్రం షూటింగ్ మొదలవుతుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. కాగా ఉత్తరాధి మఠాధిపతి సత్యాత్మతీర్థ స్వామిజీ, సినీ నిర్మాత సుధాకర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 5 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.65 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 51,349

తలనీలాలు సమర్పించినవారు : 14,082

పాతాళగంగ కాస్త కనికరించింది

● జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం

● తిరుపతికి మాత్రం ప్రమాద ఘంటికలు

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి



తుపానులు కురిపించిన వరుస వానలు జిల్లాలో భూగర్భ జలమట్టాలను ఈ ఏడాది స్వల్పంగా పెంచాయి. సగటున జిల్లా మొత్తం పది అంగుళాలు నీటి మట్టం పెరిగింది. తూర్పు మండలాల్లో అయితే ఈ పెరుగుదల గణనీయంగా ఉంది. 2023 డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరు నాటికి ఆశాజనకమైన జలమట్టం కనిపిస్తోంది. తాగునీటికి, సాగుకూ ఇది సంతోషాన్ని కలిగించే అంశం. ఇన్ని వానలు కురిసినా జిల్లా కేంద్రమైన తిరుపతిలో మాత్రం భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. రానున్న వేసవికి ప్రమాదకరమైన పరిస్థితులను ఇవి సూచిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం కురిసిన వానలు భూగర్భంలోకి ఇంకే వీలు లేకపోవడం. కాంక్రీటు జనారణ్యంగా మారిపోయిన తిరుపతిలో నీటి కుంటలు, చెరువులు ఆక్రమణలపాలై నివాస ప్రాంతాలుగా మారిపోయాయి. కొండలమీద కురిసిన వానంతా మాలాడగుండం, కపిలతీర్థం సహా నగరంలోంచే వెల్లువలా ప్రవహించినా చుక్కనీరు నిలిచే అవకాశం లేక కిందికి వెళ్లిపోతున్నాయి. ఈ కాలువల్లో నీరు భూగర్భంలోకి ఇంకకుండా కాంక్రీటు ఫ్లోరింగ్ వేసేయడానికి మించిన అనాలోచిత చర్యల ఫలితమే ఇది. ఈ వానలకు కాళంగి, మల్లిమడుగు నిండి పొంగి పారినా.. కళ్యాణిడ్యాం నిండనే లేదు. యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో వర్షపాతం కూడా తక్కువగానే నమోదైంది. జిల్లా తూర్పు మండలాల్లో వరదయ్యపాళెంలో 0.33 మీటర్లు, కోట 0.84, బీఎన్‌కండ్రిగ 0.85, కేవీబీపురం 0.99, వాకాడు 1.20, పిచ్చాటూరు 1.20, చిట్టమూరు 1.31, చిల్లకూరు 1.48, రేణిగుంట 1.99 మీటర్లు వంతున భూగర్భ జలాలు పెరగడం ఈ ఏడాది విశేషం.

అవసరం మేరకే వాడుకోండి



తిరుపతి జిల్లాలో 2023లో నమోదు అయిన వర్షపాతంతో పోలిస్తే గత డిసెంబరు చివరి నాటికి వర్షాలు బాగా పడ్డాయి. భూగర్భ జలనీటిమట్టాలు పెరిగాయి. అలా అని నీటిని వృథా చేయకూడదు. అవసరం మేరకే వినియోగించుకోవాలి.

- నాగమల్లేశ్వరరావు, జిల్లా భూగర్భ జల అధికారి

భూగర్భ జలాలు ఇలా.. (మీటర్లలో)

	2023 డిసెంబరు	2024 డిసెంబరు
తిరుపతి	14.80	16.86
చంద్రగిరి	4.80	4.76
నగిరి	3.68	3.04
సత్యవేడు	2.94	2.46
శ్రీకాళహస్తి	2.45	2.44
సూళ్ళూరుపేట	1.99	1.72
వెంకటగిరి	2.51	2.24
గూడూరు	1.55	1.76
జిల్లా సగటు	3.19	3.09

2024 జూన్- డిసెంబరు మధ్య వర్షపాతం (మి.మీ.లో)

మండలం	సాధారణం	కురిసింది
గూడూరు	943.2	1.066.7
కోట	1135.1	1456.6
వాకాడు	1113.2	1589.3
చిట్టమూరు	1018.6	1475.8
నాయుడుపేట	982	1231.1
పెళ్లకూరు	1,036	1303.4
డివీసత్రం	1212.8	1569.9
సూళ్ళూరుపేట	1234.2	1889.1
తడ	1294.2	1509.9
తిరుపతి రూరల్	895.7	1288.3
ఎర్రావారిపాళెం	681.1	767.7
పాకాల	886.8	1302
రేణిగుంట	1021.7	1340
శ్రీకాళహస్తి	1177.4	1149.4
తిరుపతి అర్బన్	994.7	1206.4
చంద్రగిరి	906.5	1188.9

ఇంటర్వ్యూ



డాక్టర్ నడింపల్లె సత్యనారాయణరాజు, తిరుపతి పుస్తకోత్సవం నిర్వాహకుడు

భారతీయ భవన్ అనగానే గుర్తొచ్చే పేరు నడింపల్లె సత్యనారాయణరాజు. తిరుపతిలో 20 ఏళ్లుగా పుస్తక ప్రదర్శల నిర్వహణ వెనుక ప్రధాన వ్యక్తీ, శక్తీ ఆయనే. టీటీడీ అధికారుల సహకారం తీసుకుంటూ, తిరుపతిలోని మేధోవర్గం సహాయం అందుకుంటూ పుస్తకోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వహణ అంత తేలికైన పని కాదు. పుస్తకం మీద ఉన్న ఇష్టం, భావి తరాల పట్ల ఉన్న బాధ్యత ఆయనను వయసును లెక్క చేయకుండా పుస్తకోత్సవ సారథిగా నడిపిస్తోంది. పుస్తకోత్సవాల నిర్వహణ సాదకబాధకాలపై భారతీయ విద్యా భవన్ తిరుపతి డైరెక్టర్ డాక్టర్ నడింపల్లె సత్యనారాయణ రాజుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ఈ తరం పుస్తకం చేత పట్టాలి



● తిరుపతిలో ఎలా మొదలైంది?

! 2006 లో భారతీయ విద్యా భవన్ స్వతంత్రంగా తిరుపతి పుస్తక ప్రదర్శనను ప్రారంభించింది. మొదట త్యాగరాజ మండపంలో నిర్వహించేవాళ్లం. సందర్శకుల సంఖ్య పెరగడంతో దానిని ఎస్వీ హైస్కూల్ మైదానంలోకి మార్చాం. ప్రస్తుతం విశాలమైన వినాయక నగర్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నాం. ఇరవై ఏళ్ళుగా తిరుపతి పుస్తక ప్రదర్శన మార్పుచేర్పులతో కొనసాగుతూ ఉంది.

● ఉద్దేశ్యం ఏమిటి?

! ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించిన ప్రముఖులందరూ మంచి పుస్తకాలు చదివి స్ఫూర్తి పొందిన వారే. పుస్తకం మనిషిని తీర్చి దిద్దుతుంది. ఆధునిక సాంకేతికత పెరగడంతో పుస్తక పఠనం తగ్గింది. టీవీలు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్ల వెంట పరుగులు తీస్తున్న తరాన్ని మళ్లీ పుస్తకాల వెంట నడిపించాలనే ఆలోచనతోనే బాధ్యతగా భారతీయ విద్యా భవన్ పుస్తకోత్సవాలను ఏటా నిర్వహిస్తోంది.

● నిర్వహణలో కష్టనష్టాలు?

! దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పబ్లిషర్స్‌ను, విక్రేతలను తిరుపతికి రప్పించడం అంత సులువు కాదు.అందరినీ ఒక చోటుకి తీసుకువచ్చినా ప్రజలు రావాలి కదా. అన్ని విద్యాసంస్థలను సంప్రదించి, విద్యార్థులను తీసుకువచ్చి, వారికి ప్రతిభా పోటీలు నిర్వహించి,బహుమతులు అందించే పని చేస్తున్నాం.సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనకు వచ్చినవారు రెండు మూడు గంటల పాటూ ప్రాంగణంలో గడుపుతారు. వీరి కోసం ఫుడ్ స్టాల్స్ కూడా ఉంటాయి. ఇవన్నీ కష్టమైన పనులే కానీ ప్రయాసగా భావించడం లేదు. భవిష్యత్ తరాలకు పుస్తకాన్ని వారసత్వంగా అందించే బాధ్యత అనుకుని నిర్వహిస్తున్నాం.

● ఆర్థిక వనరులు ఎలా?

! ఒక సారి పుస్తక ప్రదర్శన నిర్వహించాలంటే రూ. 11 లక్షలు ఖర్చు అవుతుంది. ఒక్కో స్టాల్‌కు రూ. 12 వేల చొప్పున ప్రవేశ రుసుం నిర్ణయించాం. ఇలా రూ. 6 లక్షలకు పైగా నిధులు వస్తున్నాయి. మిగిలిన ఆర్థిక భారాన్ని భారతీయ విద్యా భవన్ ద్వారా వెచ్చిస్తున్నాం. టీటీడీ కొన్ని సదుపాయాలు కల్పిస్తూ ఉంది. ఇది కొంత ఊరటను ఇస్తూ ఉంది.

● భవిష్యత్తులో ఏ మార్పులు అవసరం?

! ఇరవై ఏళ్ల క్రితం తిరుపతికీ, ఇప్పటి తిరుపతికీ చాలా మార్పులున్నాయి. ఐఐటీ, ఐజర్, వేద వర్సిటీ వంటి సంస్థలు నెలకొన్నాయి. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించిన కాలేజీలు పెరిగాయి. విద్యార్థుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే వీరికి పుస్తకాల అవసరం పెరిగింది. ఆయా రంగాల్లో మరింత జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉన్న అవకాశాలను కల్పించాలి. పుస్తక ప్రదర్శన ఇందుకు వేదిక అవుతోంది. టెక్నాలజీతో పాటు ఇతర అంశాలతో కూడిన పుస్తకాల సంఖ్య ప్రదర్శనలో పెరగాలి. కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్, పెంగ్విన్ వంటి ప్రపంచ ప్రఖ్యాత ప్రచురణ, పుస్తక విక్రయ సంస్థలను తిరుపతికి తీసుకురావాలని కోరిక. హైదరాబాద్, విజయవాడ పుస్తక ప్రదర్శనలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో తిరుపతి పుస్తక ప్రదర్శన చేపట్టాలనే లక్ష్యం ఉంది.పుస్తక ప్రేమికుల ఆదరణతో ఇది సాధ్యమవుతుందనే నమ్మకమే నడిపిస్తోంది.

ఎగబాకుతున్న వెనామి రొయ్య పిల్లల ధర



హేచరీలో రవాణాకు సిద్ధంగా ఉన్న రొయ్య పిల్లలు



ప్యాక్‌చేసిన వెనామీ సీడ్

కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వెనామి రొయ్య పిల్లల ధర స్వల్పంగా పెరుగుతోంది. నిన్న మొన్నటి వరకు అందుబాటులో ధరల్లో లభ్యమైన వెనామి రొయ్య పిల్లలు నాణ్యత, బ్రోడర్(తల్లిరొయ్య) డిమాండ్ పేరుతో ధరలు ఎగబాకుతున్నాయి. సముద్ర తీరప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల్లో గత ఏడాదిగా రొయ్యల సాగుకు క్రాఫ్ హాలిడే ప్రకటించిన ఆక్వా రైతులు మంచు తగ్గిపోవడం, రొయ్యపిల్లలకు అనుకూల వాతావరణం వస్తుండటంతో వెనామి సాగుకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో హేచరీల యజమానులు రొయ్యపిల్లల ధరలు పెంచేస్తున్నారు. తల్లి రొయ్యలను అమెరికా, తైవాన్, ఇండోనేషియా, జపాన్ దేశాల నుంచి పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు దిగుమతి చేసుకొని హేచరీల్లో పిల్లరొయ్యను ఉత్పత్తి చేస్తారు. ఆయా దేశాల్లో తల్లిరొయ్యలు ధరలు పెరిగాయని, నాణ్యమైన, ఆరోగ్యవంతమైన వెనామి రొయ్యపిల్లలు కావడంతో ధరలు పెంచుతున్నట్లు హేచరీల యజమానులు చెబుతున్నారు. ఇటీవల వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు పాండిచ్చేరి ప్రాంతాల్లోని హేచరీల్లో వెనామి రొయ్యపిల్ల 30 పైసలు ఉండేది. ప్రస్తుతం నాణ్యత పేరుతో 36 పైసలకు విక్రయిస్తున్నారు. రోజురోజుకు ధరలు పెరుగుతుండడంతో రొయ్యల సాగు విషయమై ఆక్వా రైతులు సందిగ్ధంలో పడిపోయారు.

నాటు తుపాకీ స్వాధీనం.. ఒకరి అరెస్టు

భాకరాపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ చిట్టేచెర్ల వలసదేవరగుట్ట ఎస్టీ కాలనీకి చెందిన చుక్కలపాటి వెంకటేశ్ నాటు తుపాకీ కలిగి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందింది. శుక్రవారం ఉదయం ఎస్ఐ రాఘవేంద్ర తన సిబ్బందితో దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. నాటు తుపాకీ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పంటలను ధ్వంసం చేసిన గజరాజులు



ఏనుగులు తొక్కేసిన టమోటా

ఎర్రావారిపాళెం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకాడపల్లె పంచాయతీలో ఏనుగుల మంద పంట పొలాలను ధ్వంసం చేసింది. శుక్రవారం వేకువజామున 15 గజరాజుల గుంపు కోటకాడపల్లెకు చెందిక తుల్లూరు చంద్ర, మరి కొందరు రైతుల వరి, టమోట, కాయగూర తోటలను తొక్కి, తిని నాశనం చేశాయి. అధికారులు స్పందించి ఏనుగులను అడవుల్లోకి మళ్లించాలని, పంట నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

ఐసీడీఎస్ పీడీగా వసంతబాయి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వసంతబాయి

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీగా వసంతబాయి కలెక్టరేట్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఐసీడీఎస్‌ీగా పనిచేస్తున్న జయలక్ష్మి పదోన్నతిపై ఒంగోలుకు బదిలీ అయ్యారు.

పాఠశాల విద్య బలోపేతమే లక్ష్యం

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా క్లస్టర్ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే దిశగా నూతనంగా తీసుకువచ్చిన క్లస్టర్ విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో 130 క్లస్టర్లు ఏర్పాటు చేశామని, ప్రతి క్లస్టర్‌లో 5 నుంచి పది పాఠశాలలు ఉంటాయని తెలిపారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను బట్టి మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల్లో వంతెనలు, చెరువులు దాటడం, ఎక్కువ దూరం ప్రయాణం చేసే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో కేవీఎన్ కుమార్, డిప్యూటీ ఈవో బాలాజీ, ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.48 కోట్లు

● దక్షిణ మధ్య రైల్వే జీఎం జైన్



కల్యాణ మండపం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జీఎం

తిరుపతి(సెంట్రల్), జనవరి 31 (ఆంధ్రజ్యోతి) రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.48 కోట్లు కేటాయించినట్లు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. తిరుపతి పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో రూ.6.62 కోట్లతో నిర్మించనున్న రైల్వే కల్యాణ మండపానికి భూమిపూజ చేశారు. జీఎం మాట్లాడుతూ రైల్వే ఉద్యోగులకు ఈ కల్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తిరుపతి పుణ్యక్షేత్రానికి పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని నాలుగు ప్రధాన రైలు మార్గాలకు కేంద్రమైన రేణిగుంట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే విడుదలైన రూ.25 కోట్లతో రేణిగుంట సీఆర్‌ఎస్ లూప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. చెన్నై-తిరుపతి, పూడి-ఏర్పేడు బైపాస్ మార్గాలు, గూడూరు-రేణిగుంట మూడవ రైలు మార్గం పనులకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వెంకటగిరి-నడికుడి మధ్య నూతన రైలు మార్గానికి కూడా నిధులు మంజూరయ్యాయన్నారు. తిరుపతి, పాకాల రైల్వేస్టేషన్ల మధ్య రెండవ లైన్ రైలు మార్గానికి రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ఆయన తిరుపతి ప్రధాన రైల్వేస్టేషన్ దక్షిణం వైపు రూ.300 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని, అభివృద్ధి పనులను పరిశీలించారు. తిరుచానూరు రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం రేణిగుంటకు చేరుకుని గుంతకల్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ మేనేజరు చంద్రశేఖర్ గుప్తా, అధికారులు సూర్యనారాయణ, రమణారెడ్డి, శ్రీనివాస్, క్యాప్టిల్ అరోరా, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐపీఎఫ్ మధుసూదన్, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీఎంకు సన్మానం

తిరుపతి పర్యటనకు విచ్చేసిన రైల్వే జీఎం జైన్‌ను రైల్వే ఉద్యోగ సంఘాల నాయకులు సన్మానించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు నాయకులు బీఎం బాషా, రవీంద్ర నాయక్, మారయ్య, యూనియన్ మాజీ అధ్యక్షుడు కె.సుదర్శన్ రాజు, కళాధర్, వెంకటముని, సంఘ్ నాయకులు బాబు, జయకుమార్ పాల్గొన్నారు.

భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన

ఇద్దరు ఉద్యోగుల బదిలీ!

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనానికి వచ్చిన ఓ భక్తుడితో దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు ఉద్యోగులను బదిలీ చేసినట్టు తెలిసింది. చైర్మన్ సిఫార్సుతో శ్రీవారి దర్శనం కోసం వీఐపీ బ్రేక్‌లో వెళ్లిన తనతో ఆలయంలోని దఫేదార్, సూపరింటెండెంట్ దురుసుగా మాట్లాడినట్టు చైర్మన్, టీటీడీ ఉన్నతాధికారులకు ఆ భక్తుడు ఫిర్యాదు చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆ ఇద్దరిని బదిలీ చేసినట్టు తెలిసింది. ఇక, వైకుంఠ ఏకాదశిరోజున వరాహస్వామి దర్శనం కోసం వెళ్లిన ఓ బోర్డు సభ్యురాలిని ఆలయంలోకి అనుమతించకుండా దురుసుగా మాట్లాడిన మరో ఉద్యోగిని కూడా సస్పెండ్ చేసినట్టు తెలిసింది. ఇటీవల శ్రీవారి దర్శనం కోసం వస్తున్న భక్తులతో ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు అధికమయ్యాయి. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపట్టాలన్న నిర్ణయంలో భాగంగా ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా విక్రమ్‌కుమార్‌రెడ్డి



తిరుపతి(కలెక్టరేట్), జనవరి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా విక్రమ్ కుమార్‌రెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ ఎస్సీ సంక్షేమ, సాధికార అధికారిగా పనిచేస్తున్న చెన్నయ్య చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయనకు ఉమ్మడి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

నకలీ టికెట్లతో భక్తులను బురిడీ కొట్టించిన దళారీ

తిరుమల, జనవరి31(ఆంధ్రజ్యోతి): నకిలీ టికెట్లతో ఓ దళారీ హైదరాబాద్ భక్తులను మోసగించాడు. హైదరాబాద్‌కు చెందిన ఉపేందర్ శ్రీవారి దర్శనం కోసం నళినికాంత్ అనే స్నేహితుడి ద్వారా సతీష్ అనే వ్యక్తిని సంప్రదించారు. దళారీ అయిన సతీష్ జనవరి 12వ తేదీన మూడు టికెట్ల కోసం ఫోన్‌పే ద్వారా రూ.2,100 డబ్బులు తీసుకున్నాడు. అనంతరం రూ.10 లక్షల దాత కోటాలో టిక్కెట్లను ఈనెల 18వ తేదీన భక్తుడు ఉపేందర్‌కు సతీష్ పంపాడు. ఈ క్రమంలో భక్తులు 29వ తేదీన ఉదయం 10.15 గంటలకు తిరుమలకు చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దకు వెళ్లారు. టికెట్ స్కాన్ కాకపోవడంతో డోనార్ సెల్‌ను సంప్రదించాలని అక్కడి సిబ్బంది సూచించారు. డోనార్ సెల్‌కు వెళ్లిన భక్తులకు ఈ టికెట్లు నకిలీవని తేలింది. దీనిపై భక్తులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ



పుత్తూరు అర్బన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో భూ రిజిస్ట్రేషన్ల కోసం రద్దీ నెలకొంది. రిజిస్ట్రేషన్ల విలువల సవరణ ప్రక్రియతో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు బారులు తీరారు. గురు, శుక్రవారాల్లో రాత్రి వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగింది. కంప్యూటర్లపై ఒత్తిడి పెరగడంతో మొరాయించాయి. ప్రభుత్వం మాత్రం భూముల ధరలు అధికంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ విలువల సవరణలు హేతుబద్ధంగా చేపట్టినట్లు సమాచారం. పుత్తూరు పరిధిలో 20 నుంచి 22 శాతం వరకు పెరుగుతుందని సబ్ రిజిస్ట్రార్ విజయ్‌భాస్కర్ పేర్కొన్నారు.

బాధ్యతగా పనిచేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, అధ్యాపకులు

పుత్తూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ కోరారు. తన నివాసంలో పుత్తూరు డిగ్రీ కళాశాల అడ్మిషన్ల వాల్‌పోస్టర్లను ఆయన అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1983లో తన తండ్రి ఎమ్మెల్యే ముద్దుకృష్ణమ అడిగిందే తడవుగా డిగ్రీ కళాశాలను అప్పటి సీఎం ఎన్టీఆర్ మంజూరు చేయడమే కాకుండా స్వయంగా ప్రారంభించారన్నారు. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు నరసింహులు, మస్నం నరసింహులు, సుజన పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సిద్దేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం

పుత్తూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లిలో నూతనంగా నిర్మించిన సిద్దేశ్వరస్వామి ఆలయ అష్టబంధన విగ్రహ ప్రతిష్ఠాపన కుంభాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. గణపతిపూజ, కలశ ప్రతిష్ఠ, నవగ్రహ పూజలు, హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రోజా, మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పుత్తూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయ మహా కుంభాభిషేకంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు పాల్గొన్నారు. శుక్రవారం ఆలయం వద్ద నిర్వాహకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ నాయుడు విజయ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బోర్డు సలహా సభ్యుల సమావేశం



సలహా మండలి సభ్యుల సమావేశం

పుత్తూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పుత్తూరు రైల్వేస్టేషన్‌లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని శుక్రవారం స్థానిక సీనియర్ స్టేషన్‌మాస్టర్ శ్రీనివాసులును సదరన్ రైల్వే బోర్డు స్టేషన్ సలహా మెంబర్లు, బీజేపీ నాయకులు కోరారు. ఎంబీ రోడ్డులోని అండర్ బ్రిడ్జి వద్ద లీకేజీ కారణంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుత్తణి - రేణిగుంట స్టేషన్ల మధ్య తిరిగే ప్యాసింజర్‌ను పునః ప్రారంభించాలని, ప్రయాణికుల విశ్రాంతి గదిని సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ బోర్డు సలహా సభ్యులు శ్రీధర్‌నాయుడు, కోటకొండ బాబు పాల్గొన్నారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలే ధ్యేయంగా పనిచేస్తున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. ఈనెల 1,2,3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న మహాసభల పోస్టర్లను అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆవిష్కరించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్, విజయ్, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, శివ, గోవిందస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రాధాన్యం



ఎమ్మెల్యేకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు

వడమాలపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు ప్రాతినిధ్యం వహించేలా ప్రాధాన్యం కల్పిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. వాసవీ కన్యాకపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగా నిర్వహించాల్సిందిగా ఉత్తర్వులు జారీ అయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో పట్టణంలోని వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, ప్రధాన కర్యాదర్శి సుబ్బరాజశెట్టి వాసవీ దేవి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు బహూకరించారు. ఉదయం అమ్మవారిని పాలాభిషేకం, సాయంత్రం కన్యకులకు వడిబాలు కార్యక్రమాలు జరిగాయి. ఎస్ఐ ధర్మారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు తదితరులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పట్టువస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ఉయ్యాలపై అధిష్ఠింపజేసి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

గడ్డి మందు తాగి యువకుడి మృతి



రేవంత్ (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన దుగ్గులూరు రేవంత్(23) శుక్రవారం గడ్డి మందు తాగి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కృష్ణమనాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన వేణుగోపాల్, కిష్టమ్మ కుమారుడు రేవంత్ నిత్యం మొబైల్‌లో ఫ్రీ ఫైర్ గేమ్ ఆడుతూ ఉండేవాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 29న గడ్డి మందు తాగాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో తమిళనాడులోని వేలూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రేణిగుంట మండలంలోని ఓ కంపెనీలో రేవంత్ పనిచేసేవాడని బంధువులు తెలిపారు.

వ్యాన్ బోల్తా: 600 బాతుల మృతి

కోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగుంట వద్ద శుక్రవారం బాతులను తీసుకెళ్తున్న వ్యాన్ బోల్తాపడింది. గూడూరు నుంచి మినీ వ్యాన్‌లో 800 బాతులు కోటకు తరలిస్తుండగా కొండుగుంట వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 600 బాతులు మృతి చెందాయి.

ప్రతి గ్రామానికీ మంచినీరు: మంత్రి ఆనం

ఉమ్మడి నెల్లూరు జిల్లా దాహార్తి తీర్చేందుకు
రూ.8400 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు



ఇంజనీరింగ్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

నెల్లూరు(హరనాథపురం) జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అమృతధార-2 పేరుతో ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చడానికి రూ.8400 కోట్లతో బృహత్తర ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇంజనీరింగ్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంజూరైన జల్ జీవన్ పనులను రద్దు చేసి కొత్త డీపీఆర్‌లు తయారు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, డీఈలు స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి పనులను ప్రతిపాదించాలని సూచించారు. థర్డ్ పార్టీ కన్సల్టెన్సీలను కూడా ఏర్పాటు చేశామని, అధికారుల సమన్వయంతో పూర్తిస్థాయిలో నివేదిక తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి పనులు మొదలుపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

2058 జనాభా అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 2058 నాటి జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీరు అందించేందుకు బృహత్తర ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం సోమశిల నుంచి 24 మండలాలకు 1.58 టీఎంసీలు, కండలేరు నుంచి 23 మండలాలకు 2.64 టీఎంసీలను వినియోగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. జల్‌జీవన్ మిషన్ పథకాన్ని సంపూర్ణంగా వినియోగించుకుని మరో మూడేళ్లలో ప్రతి పల్లెకు నీరందిస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కేశవ్, ఆర్‌డబ్ల్యూఎస్, సోమశిల, తెలుగు గంగ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, నెల్లూరు మున్సిపల్ పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, ఎస్‌ఈలు వెంకటరమణ, వెంకటరమణారెడ్డి, రాధాకృష్ణా రెడ్డి, దేశ్‌నాయక్, గంగాధర్, మోహన్, అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో విద్యారమ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఆత్మకూరు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శేష రత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డయింగ్ యూనిట్లన్నీ మూసివేయాల్సిందే

- నగరి మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల ఏకగ్రీవ తీర్మానం





సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం, డయింగ్ యూనిట్లపై మాట్లాడుతున్న సభ్యులు

నగరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):నగరి ప్రజలు ఆరోగ్యంగా వుండాలంటే పట్టణ పరిధిలోని డయింగ్ యూనిట్లను మూసివేయాల్సిందేనని మున్సిపల్ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.డయింగ్ యూనిట్లను విధిగా మూసివేయించాలి లేకపోతే ఈటీపీ ప్లాంట్లను, ఆర్‌వోలను అమలు చేయాలన్నారు.నగరి మున్సిపల్ సమావేశం చైర్మన్ నీలమేఘం అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది.మున్సిపల్ విప్ దయానిధి, చైర్మన్ నీలమేఘం మధ్య ప్రారంభంలోనే వాదన చోటు చేసుకుంది.డయింగ్‌యూనిట్ల విషయం ప్రస్తావించాకే సమావేశపు అజెండాను చదవాలని విప్ డిమాండ్ చేయగా అజెండాను చదివాక ఒక్కో సమస్యపై చర్చించి అనంతరం ఎంత సమయమైనా సరే డయింగ్ యూనిట్ల గురించి చర్చిద్దామని చైర్మన్ పట్టుబట్టారు.అనంతరం అజెండా చదవగా ఒక్కో అంశంపై కౌన్సిలర్లకు సంబంధిత అధికారులచే చైర్మన్ వివరణ ఇప్పించారు.ఏపీఐఐసీ భూముల్లో పరిశ్రమల స్థాపనకు అనుమతి కోరగా పరిశ్రమలు వచ్చాక అనుమతి ఇద్దాం అంటూ కౌన్సిలర్ ఇంద్రయ్య పేర్కొన్నారు.తచ్చూరు-చిత్తూరు హైవే రోడ్డుకు ఈకేకే వారికి గ్రావెల్ తరలింపునకు అనుమతి కోరగా అనవసరంగా సమావేశంలో అధికారులు ప్రతిపాదనను చేర్చడం, కౌన్సిలర్లు వద్దన్నా అనుమతులు ఇవ్వడం జరుగుతోందని దయానిధి విమర్శించారు.అలాంటప్పుడు కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదనలు ఎందుకు పెడతారనడంతో రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారి చెప్పారు.గత నెల జరిగిన సమావేశంలో డయింగ్ యూనిట్లను మూసివేయాలని తీర్మానం చేసినా ఫలితం లేదన్న దయానిధి టైర్ల కంపెనీ వలన 2000 ఇళ్లలో నివసిస్తున్న వారు కాలుష్యం భరించలేకపోతున్నారని, కాబట్టి ఆ పరిశ్రమను మూసివేయాలని తీర్మానించినా నేటికీ మూసివేయలేకపోతున్నామన్నారు.అలా కాకుండా డయింగ్ యూనిట్ల విషయంలో అందరూ ఒకే మాటమీద వుండాలన్నారు. ఈటీపీ ప్లాంట్లను నడిపితే తప్ప డయింగ్ యూనిట్లు వుండకూడదన్నారు.కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ నగరి పట్టణాన్ని కాలుష్య కోరలనుంచి రక్షించాలంటే అన్ని డయింగ్ యూనిట్లను మూసివేయించాలనగా సభ్యులంతా మద్దతు ప్రకటించారు. డయింగ్ యూనిట్లను పట్టణానికి వెలుపల ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.అనుమతులు లేకనే పలు డయింగ్ యూనిట్లు కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.నగరిలో 51 మాన్యువల్, 16 మెకానికల్ డయింగ్ యూనిట్లు నడుస్తున్నాయని, వీటిలో మాన్యువల్ ప్లాంటుకు కామన్ ఈటీపీ ప్లాంటు వుందని,ఎనిమిది మెకానికల్ ప్లాంట్లకు ఈటీపీ గాని, ఆర్‌వో గాని లేవని, కామన్ ఈటీపీ ప్లాంటును చూపించి అనుమతులు తెచ్చుకున్నారన్నారు.ఒక టన్ను నూలుకు రంగు వేస్తే దాన్ని శుద్ధి చేయడానికి రూ.3లక్షలు ఖర్చవుతుందన్నారు.దీంతో శుద్ధీకరణ చేయకనే డ్రైనేజీ కాలువల్లో, చెరువు కాలువల్లో రంగునీటిని వదిలేస్తున్నారని విమర్శించారు.దీంతో జనం సోరియాసిస్, క్యాన్సర్, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికంతటికీ కారణం రంగునీళ్లేనని బీడీ భాస్కర్ తెలిపారు. వీలైనంత త్వరలో అన్ని డయ్యింగ్ యూనిట్ల మూసివేతకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

వెంబులూరులో సివిల్స్ రైట్స్ డే



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంబులూరు గిరిజన కాలనీలో శుక్రవారం సివిల్స్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ సమాజంలో సామాజికంగా వెనుకబడిన వర్గాల్లో చైతన్యం తీసుకురావడానికి సివిల్స్ రైట్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఎవరినైనా చులకనగా, వివక్షకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, ఆర్ఐ ప్రియాంక, సర్వేయర్ రాజగోపాల్, వీఆర్వో ఆమని, ఏఎస్‌వో వెంకటయ్య, సిబ్బంది పార్వతి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై కొరడా

వెంకటగిరి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝులిపించారు. పట్టణంలోని 9 షాపులు ఉండగా 5 దుకాణాల వద్ద అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను అధికారులు అదుపులోకి తీసుకొన్నట్లు తెలిసింది. ఓ షాపు వద్ద 60కి పైగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొన్నప్పటికీ కేసులు నమోదు చేయకుండా దుకాణాల సిండికేట్ ఒత్తిడి చేయడంతో ఎక్సైజ్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారం బయటకు పొక్కకుండా మద్యం షాపుల యజమానులు జాగ్రత్త తీసుకున్నట్లు తెలిసింది.

నల్లపరెడ్డి గోపాలరెడ్డికి నివాళి



గోపాలరెడ్డి విగ్రహం వద్ద నాయకులు

కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచు నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి వర్ధంతి కోట పట్టణంలో శుక్రవారం జరిగింది. బజారు సెంటర్‌లో ఉన్న గోపాలరెడ్డి విగ్రహానికి సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ దేవత కోటమ్మ ఆలయంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, మణి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మీజూరు మల్లికార్జున్, సర్పంచు వెంకటరమణమ్మ, వాకా విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వజ్జావారిపాళెంలో పశువైద్య శిబిరం

కోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ వజ్జావారిపాళెంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్ పశువులకు నట్టల నివారణకు మందులు పంపిణీ చేశారు. అదే విధంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా వ్యాక్సిన్లు వేశారు. రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

వాటర్ ట్యాంక్ పరిశీలన

కోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మక్క కండ్రిగలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను శుక్రవారం ఎంపీడీవో వేణు పరిశీలించారు. ట్యాంక్ నుంచి కలుషిత నీరు వస్తోందని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో వేణు, పంచాయతీ కార్యదర్శి రియాజ్ ఉద్దీన్‌తో కలిసి ట్యాంక్‌ను పరిశీలించారు. నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

కోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరారెడ్డిసత్రం వద్ద శుక్రవారం మోటారు బైక్‌ను లారీ ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన శశికుమార్ తన భార్య, తల్లి కుమార్తెతో కలసి బైక్‌లో సూళ్లూరుపేటకు వెళ్తుండగా వీరారెడ్డిసత్రం వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ శోభారాణి తెలిపారు.

హత్య కేసు విచారణ



జరుగుమల్లిలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జరుగుమల్లి గ్రామాన్ని గూడూరు డీఎస్పీ గీతాకుమారి శుక్రవారం సందర్శించారు. మురుగునీటి వివాదమై అన్నదమ్ముల మధ్య గొడవ జరిగిన ఘర్షణలో కోటయ్యను ఆయన తమ్ముడు మస్తాన్ హత్యచేసిన సంఘటన తెలిసిందే. ఈ కేసు విషయమై కోట ప్రభుత్వాస్పత్రి, జరుగుమల్లి గ్రామాల్లో డీఎస్పీతో విచారణ జరిపారు. ఆమె వెంట వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, కోట ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

వివాహిత అదృశ్యం



రమ్య (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఆర్యభట్ట నగర్‌కు చెందిన కొండూరు రమ్య అదృశ్యం అయినట్లు ఆమె తండ్రి నారాయణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆర్యభట్ట నగర్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న రమ్య ఈనెల 24న సాయంత్రం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సన్మానం

నాయుడుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె.భక్తవత్సల్‌ను నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శి పసల చంద్రయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

భూపతేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

చిట్టమూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యాకసిరి తిప్పపై వెలసిన భూపతేశ్వర స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. పాలక మండలి నిర్వాహకులు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు దాతలు సమర్పించిన బంగారు పూత వేసిన వెండి ఆభరణాలను వేద పండితులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

గూడూరు అర్బన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఈనెల 3వ తేదీన సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, మణి, శంకరయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలించొద్దు

పెళ్లకూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమతులు లేకుండా మట్టి, ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ద్వారకనాథరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం అక్రమంగా మట్టి, ఇసుక రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. కప్పగుంగకండ్రిగ సమీపంలో మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు.

కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

తడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాపు, బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల రుణాల కోసం ఈనెల 7వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఏపీఓబీఎంఎంఎస్ డాట్ ఏపీసీఎఫ్ఎస్ఎస్ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ

గూడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా కష్టపడిన చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఎవరైనా డ్రగ్స్‌ను విక్రయించినా, వినియోగించినా కఠిన శిక్ష ఉంటుందన్నారు. దేశాభివృద్ధిలో యువతే కీలకమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, భాస్కర్, నీరజ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతోనే ఉద్యోగులకు గుర్తింపు



రవీంద్రబాబును సన్మానిస్తున్న ఉద్యోగులు

గూడూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయడం ద్వారా ప్రజల నుంచి గుర్తింపు పొందుతారని పంచాయతీరాజ్‌శాఖ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రియాజ్ ఆహ్మద్ అన్నారు. శుక్రవారం పంచాయతీరాజ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్రబాబు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా రియాజ్ ఆహ్మద్ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌శాఖలో 36 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో అంకితభావంతో పనిచేసిన రవీంద్రబాబు సేవలు ప్రశంసనీయమన్నారు. ఉత్తమ ఇంజనీరుగా పలుమార్లు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారని తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీకృష్ణ నాయుడు, శంకరనారాయణ, కాంతారావు, గిరినాధ్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయదారులు

నాయుడుపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం రద్దీ నెలకొంది. శనివారం నుంచి భూముల విలువ పెరగనున్న నేపథ్యంలో చాలామంది క్రయవిక్రయదారులు శుక్రవారం రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తరలివచ్చారు. సాధారణ రోజుల్లో రోజుకు 10నుంచి 12 రిజిస్ట్రేషన్లు జరుగుతుండగా, గత రెండు రోజులుగా శుక్రవారం 20-23 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ పెంచలయ్య తెలిపారు.

రేణిగుంట పార్కు సుందరీకరణకు ప్రణాళికలు

తిరుపతి కమిషనర్ మౌర్య

రేణిగుంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంచినీళ్ల గుంట పార్కు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తిరుపతి కమిషనర్, తుడా ఉపాధ్యక్షురాలు మౌర్య ఆదేశించారు. మండలంలోని సూరప్పకశం వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్లను, మంచినీళ్ల గుంటను, గ్రీన్ పార్కు, రోడ్డులోని తుడా పార్కును శుక్ర వారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తుడా లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. పార్కులో ఎండిన మొక్కలు తొలగించి కొత్తవి నాటాలన్నారు. పార్కు సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, సీఈవో దేవికుమారి, డీఈ బాషా, ఉద్యానవన శాఖాధికారి మాలతి, సర్వేయర్ దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.



మంచినీళ్ల గుంటను పరిశీలిస్తున్న మౌర్య, అధికారులు

సమస్యలను ఎదుర్కొనే తత్వాన్ని అలవర్చుకోండి

రేణిగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమస్యను ఎదుర్కొనే తత్వాన్ని అలవర్చుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్నమాచార్య కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన యాక్సిడెంట్లు, మహిళలపై జరురగుతున్న అగాయిత్యాలు, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదమునిరెడ్డి, సీఐ శరత్ చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న డీఎస్పీ

గిరాకీలు రావడం లేదు... ఉపాధి కల్పించండి

రైల్వే జీఎంకు లైసెన్స్ కూలీల వినతి

రేణిగుంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లైసెన్సు కూలీలుగా విధులు నిర్వహిస్తున్న తమకు గిరాకీలు రావట్లేదని రైల్వే జీఎం అరుణ్‌కుమార్ దృష్టికి రేణిగుంట రైల్వే స్టేషన్‌లో కూలీలు శుక్రవారం తీసుకొచ్చారు. తిరుపతి పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో ప్రత్యేక రైలులో గుంతకల్లు వరకు ఇన్‌స్పెక్షన్‌కు వెళుతుండగా ఈ మేరకు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. స్టేషన్‌లో లిఫ్టులు ఏర్పాడు చేయడంతో పాటూ చక్రాల సూట్ కేసులు రావడంతో గిరాకీలు తగ్గిపోయాయని ఈ సందర్భంగా జీఎం దృష్టికి తీసుకెళ్లారు. తమకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు. డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ శేషగిరినాథ రెడ్డి, ఐపీఎఫ్ సందీప్‌కుమార్, గుంతకల్లు, సికింద్రాబాద్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.



రైల్వే జీఎంకు కూలీల స్వాగతం

నగదు రికవరీకి ఆదేశం

ఉపాధి హామీ పనులపై బహిరంగ సభ

నారాయణవనం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో దుర్వినియోగమైన నగదు రికవరీకి డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో ఉపాధి హామీ బహిరంగ సభ జరిగింది. ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి వరకు మండలంలో జరిగిన 928 పనులకు రూ.12.08 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో రూ.2,81,640, ఎంసీసీ కింద చేపట్టిన పనుల్లో రూ.22,139 నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. ఉపాధి కూలీ ఫిర్యాదు మేరకు అవినీతికి పాల్పడిన నారాయణవనం క్షేత్ర సహాయకుడు దిలీప్ కుమార్‌ను తాత్కలికంగా విధుల నుంచి తొలగిస్తూ డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. డీవీవో శివయ్య, ఏపీడీ సరిత, ఏపీవో సుకన్య, ఎంపీడీవో గుణశేఖర్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎస్సార్పీ రవి, ఎస్టీఎం కోనయ్య తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న డ్వామా పీడీ

శుకబ్రహ్మాశ్రమంలో ప్రత్యేక పూజలు





ప్రత్యేక పూజలు - శుకబ్రహ్మాశ్రమానికి విచ్చేసిన విదేశీయులు

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. వ్యాసాశ్రమ వ్యవస్థాపకుడు, విద్యాప్రకాశనందగిరి గురువు మలయాళస్వామి శుకబ్రహ్మాశ్రమానికి విచ్చేసి పూజలు నిర్వహించిన రోజు కావడంతో ఈ పూజలు చేశారు. గణపతి, మహారుద్ర, లక్ష్మీనారాయణహోమాలు జరిగాయి. ఆశ్రమ పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి ఆధ్వర్యంలో పూర్ణాహుతి జరిగింది. అనంతరం సుమారు వందమంది భక్తుల చేత 18 అధ్యాయాల గీతాపారాయణం జరిగింది. సత్యసాయ భజనమండలి ఆధ్వర్యంలో భజన జరిగింది. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. ఈ పూజల్లో న్యూజిల్యాండ్‌కు చెందిన నోమి జార్జియా, పద్మావతి, తన్మయి, మునీంద్ర ఈ పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ నిర్వాహకులు ఆంగ్లంలో ముద్రితమైన విద్యాప్రకాశనందగిరి రచించిన గ్రంథాన్ని, తీర్థప్రసాదాలు అందజేశారు.

పకడ్బందీగా మహాశివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన గుడిమల్లం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పార్కింగ్, బ్యారికేడ్లు, దర్శనం సులభంగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రామచంద్రారెడ్డి, ఏర్పేడు సీఐ జయచంద్ర, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ గిరినాయుడు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద అధికారులు

గురవయ్యనాయుడికి టీడీపీ నాయకుల నివాళులు

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడికి వెంటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వ్యాపారవేత్త, టీడీపీ నాయకుడు గంగాప్రసాద్ శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. మునిచంద్రనాయుడు, ప్రకాష్‌నాయుడు, దయానాయుడు, రవినాయుడు, గాలి మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్‌లపై చర్యలు

సత్యవేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా ఇసుక డంపింగ్ చేసుకుంటే సంబంధిత స్థల యజమానులపై కేసులు నమోదు చేస్తామని సీఐ మురళి ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని మారుమూల ప్రాంతాల్లో కొందరు ఇసుకను డింపింగ్ చేసుకుని రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారం ఉందన్నారు. ప్రధానంగా అల్లప్పగుంట, జడేరి గ్రామాల్లో పొలాల్లో ఇసుక డంపింగ్ చేసుకుంటున్నట్లు పక్కా సమాచారం ఉందన్నారు. అక్రమ రవాణాకు పాల్పడితే ఎలాంటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

వరదయ్యపాళెం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణలో ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు లేకపోతే సమాజం మొత్తం రోగాల కుంపటిగా మారుతుందన్నారు. ఈవో బసిరెడ్డి, కానిస్టేబుళ్లు వెంకటముని, హరి,సుబ్బు, గణేష్, ఉదయ్‌కిరణ్, హోంగార్డు ప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు దిలీప్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు పోరు పోస్టర్ల ఆవిష్కరణ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫీజు పోరు పోస్టర్లను సత్యవేడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త రాజేష్ ఆధ్వర్యంలో మండలంలోని నెలవాయిలో శుక్రవారం ఆవిష్కరించారు. వైసీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వి.రాకేష్, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, మణినాయుడు, గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలకు మారుపేరు వైసీపీ: ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ భూ కబ్జాలకు మారుపేరని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో వైసీపీ నేతల భూకబ్జాలపై మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాజీ మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని అటవీ భూములను ఆక్రమించడం సిగ్గు చేటన్నారు. పర్యావరణ పరిరక్షణకు అటవీభూములు ఎంతో అవసరమన్నారు. అభివృద్ధికి ఎంతోకీలకమైన పరిశ్రమల స్థాపనకు అటవీభూముల అనుమతి లభించదన్నారు. అలాంటి చోట భూములను ఆక్రమించడమే కాకుండా ప్రజాధనంతో రోడ్లు నిర్మించుకున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. పెద్దిరెడ్డి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న వ్యవసాయక్షేత్రాన్ని కన్నెత్తి చూసేందుకు వీలులేకుండా రాచరికం వ్యవస్థ తరహాలో కట్టుదిట్టమైన కంచెను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ ఇడుపులపాయలో వందలాది ఎకరాల అటవీభూములను ఆక్రమించుకున్నారని, అది వెలుగులోకి రావడంతో ప్రభుత్వ అవసరాలకు అప్పగిస్తున్నట్లుగా నాటకం నడిపించారని ఎద్దేవా చేశారు. ఇక ఇదే పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అటవీ భూములను కబ్జా చేయడం అందరికీ తెలిసిందేనన్నారు.



భూసమస్యల పరిష్కారం కోసమే రీ సర్వే

జసత్యవేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్డీవో కిరణ్మయి చెప్పారు. మండలంలోని కాదిరివేడులో ఆర్డీవో ఆధ్వర్యంలో శుక్రవారం రీసర్వే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ... రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కాగా పంచాయతీలో 828 ఎకరాలున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఇందులో ప్రభుత్వ భూములు 325 ఎకరాలున్నాయి. నాలుగు బృందాలు రీసర్వేలో పాల్గొంటున్నాయి. మొదట గ్రామ సరిహద్దులను గుర్తిస్తున్నారు. అనంతరం ప్రభుత్వ భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. ఇది పూర్తి కాగానే పట్టా భూముల రీసర్వేకు రైతులకు నోటీసులను అందజేస్తారు. విస్తీర్ణం గుర్తించడంలో సమస్యలు తలెత్తకుండా సర్వే నెంబరు, సబ్ డివిజన్ అనుసరించి సర్వే చేపట్టనున్నారు. ప్రతీ సబ్ డివిజన్‌కు క్యూఆర్ కోడ్‌ను కేటాయించనున్నారు. కార్యక్రమంలో డీఐఎస్ ప్రసాద్, ఆర్ఎస్‌డీటీ త్యాగరాజు, మండల సర్వేయర్ చంద్రశేఖర్, వీఆర్వో మోహన్‌రాజ్, నాగార్జున, రాఘవేంద్ర పాల్గొన్నారు.



గ్రామసభలో ప్రసంగిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

రిజిస్ట్రేషన్ల సందడి





శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం జనసందడి నెలకొంది. శనివారం నుంచి భూముల ధరలను ప్రభుత్వం పెంచనున్న విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ముందుగా తక్కువ చలానా చెల్లించవచ్చన్న ఆలోచనతో రిజిస్ట్రేషన్లు చేసుకునే వారి సంఖ్య అధికంగా కనిపించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్లప్రక్రియ స్తంభించింది. అయితే సాయంత్రం నుంచి రిజిస్ట్రేషన్లను జరిపించారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలిద్దామని తొట్టంబేడు తహసీల్దారు పిలుపునిచ్చారు. సివిల్ రైట్స్ డే సందర్భంగా శుక్రవారం దొంగల మడూరు ఎస్సీ కాలనీలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల కేసుల గురించి వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం గుండేలిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గురుమిత్ర వ్యవస్థాపకుడు, ఉపాధ్యాయుడు చెంచయ్య టెన్త్ విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముదిరంచిన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. హెచ్ఎం మునితిరుమలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి పూజలు



శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధిలో కొలువై ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని పుస్కరించుకుని పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మహిళా మండలి ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. అనంతరం కన్నెపిల్లలకు మర్యాద, రాత్రి మాడవీధుల్లో అమ్మవారి పల్లకి ఊరేగింపు నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేణిగుంట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 1న శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విష్ణు చిరంజీవి తెలిపారు. అన్ని శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

దళితుల భూముల సర్వే



బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్‌పురంలో దళితులు సాగు చేస్తున్న భూములను సర్వేయరు రాజ్‌కుమార్, ఆర్ఐ నలయ్య, వీర్వోల ఆధ్వర్యంలో సర్వే చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య మాట్లాడుతూ కాటూరు రెవెన్యూలోని సర్వే నెం.340లో 30 ఎకరాలను దళితులు 20 సంవత్సరాలుగా సాగు చేస్తున్నారని తెలిపారు. దళితులకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టామని, ఎట్టకేలకు సర్వేకు మోక్షం కలిగిందన్నారు.

సంఘమిత్రకు రాష్ట్రస్థాయి అవార్డు

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన క్రాంతి మ్యాక్స్ గ్రామ సంఘం సహాయకురాలు మోహన కుమారికి డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు అధికారి శోభన్ బాబు చేతులు మీదగా సూళ్ళూరుపేట మండలంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం జ్ఞాపికను అందజేశారు. స్త్రీనిధి రుణం పొందడం, చెల్లించడంలో బీఎన్‌కండ్రిగకు చెందిన క్రాంతి మాక్స్ గ్రామ సమాఖ్య ఆదర్శంగా నిలవడంతో రాష్ట్రస్థాయి ఎంపికైంది.

టీడీపీ నాయకురాలికి మాతృవియోగం

- నివాళులర్పించిన ఎమ్మెల్యే

పిచ్చాటూరు, జనవరి 31(ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుమాంజలి తల్లి సక్కుబాయమ్మ(94) శుక్రవారం మృతి చెందారు. కాగా సక్కుబాయమ్మ భర్త వెంకటాచలంనాయుడు పిచ్చాటూరు సమితికి టీడీపీ మొట్ట మొదటి అధ్యక్షుడు. కాగా ఆమె కుమారుడు రవినాయుడు తిరుపతి జిల్లా టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం కావడంతో పలువురు ప్రధాన పార్టీల రాజకీయ నేతలు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్ రెడ్డితో కలసి సక్కుబాయమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కేవీబీపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆదిమూలం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయ సమీపంలో అంబేడ్కర్ భవన నిర్మానానికి భూమిపూజ జరిగింది. అలాగే కేవీబీపురం - కళత్తూరు రోడ్డుకు రూ.75లక్షలతో తారురోడ్డు నిర్మాణానికి పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ... మండలంలో కాజ్‌వేలు, పూడి గ్రామాలకు వెళ్లే కాళంగియేరుపై వంతెన నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, మాజీ ఎంపీపీ మణి, సర్పంచు బాలాజీ, మల్లికార్జునరెడ్డి, జయరామిరెడ్డి, కిషోర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఎంపీడీవో రాధారాణి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజలో ఆదిమూలం


కార్పొరేట్ స్థాయిలో వసతి గృహాలు



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వసతిగృహాలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీసీ హాస్టల్‌ను ప్రారంభించారు. ఇటీవల వసతిగృహానికి మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్‌ను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

నాగలాపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే ఆదిమూలం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 18వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అదేవిధంగా రథోత్సవానికి మాడవీధుల విస్తరణ పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్, నాయకులు పార్తిబన్, సెల్వకుమార్, మురళి, ఇళంగోవరెడ్డి, ఎస్ఎం సురేష్, రాధాకృష్ణారెడ్డి, ఆలయ ఈవో లత, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహా శివరాత్రి ఉత్సవాలపై మంత్రుల సమీక్ష

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి) శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల జరనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలపై శనివారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమీక్షించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘ కార్యాలయంలో మధ్యాహ్నం 1గంటలకు ఈ సమీక్ష జరగనుందన్నారు. ఎమ్మెల్యే సుధీర్, కలెక్టర్ వెంకటేశ్వర్ కూడా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

వరదయ్యపాళెం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో గృహ లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ దయాకర్ చెప్పారు. మండలంలోని కడూరు లే అవుట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ మొత్తం 13 లేఔట్లలో సుమారు 292 ఇళ్లు ఉన్నాయన్నారు. వివిధ దశలో ఉన్న ఇళ్లను లబ్ధిదారులు పూర్తిచేసుకుని బిల్లులు పొందాలన్నారు. అధికారులు శ్రీనివాసరావు, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ప్రారంభం

సత్యవేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయశాఖ సమీపంలో ఏర్పాటు చేసిన మన గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ప్రసాదరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ స్థానిక రైతులకు గ్రోమోర్‌లో ఇకపై ఎరువులు, మందులు కంపెనీ ధరలకే అందుబాటులోకి వస్తాయన్నారు. ఏవో మురళి, గ్రోమోర్ మేనేజర్ అంకుజ్, సిబ్బంది నాగభూషణ రెడ్డి, ఇందుమతి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేద్దాం

శ్రీకాళహస్తి, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేద్దామని ఆ పార్టీ నాయకులు కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏరియా కార్యదర్శి జె.గురవయ్య, పట్టణ కార్యదర్శి గోపి మాట్లాడుతూ ప్రతి వార్డు, ప్రతి పల్లెలో పేదలను గుర్తించి ఇంటి కోసం, ఇంటి స్థలం కోసం అర్జీలు రాసి తహసీల్దారు కార్యాలయానికి తీసుకురావాలన్నారు. మించల శివ కుమార్, శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాలకు అర్జీలు సమర్పిద్దామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్ పిలుపునిచ్చారు. పట్టణ పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ పేదలకు మూడు సెంట్ల కోసం ఈనెల 10వ తేదీ తహసీల్దారు కార్యాలయం వద్ద అర్జీలు సమర్పిద్దామన్నారు.